

వసూళ్లు అంతంతే!



నేడు అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన







ఆదమరిస్తే.. అంతే!

టెన్త్.. ఇంటర్.. పరీక్షలు ముగిశాయి.. విద్యార్థులకు దాదాపుగా వేసవి సెలవులు వచ్చేశాయి.. చిన్న తరగతులకు చూస్తే ఒంటిపూట బడులు నడుస్తున్నాయి.. దీంతో ఆనందానికి హద్దే లేకుండాపోతోంది.. ప్రతిరోజూ ఈరోజు ఏంటీ అనే ఆలోచనే.. దీంతో చాలా మంది పిల్లలు.. యువత సరదాగా గడుపుదామని నదీ స్నానాల బాటపడుతున్నారు. అయితే ఆదమరుపుగా ఉన్నారో ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్టే.. నది ఎంత ప్రశాంతంగా కనిపిస్తుందో ప్రమాదం జరిగిన తరువాత అంతే విషాదాన్ని మిగులుస్తోంది. అందుకే తస్మాత్ జాగ్రత్త.. నదిలో స్నానాలకు దిగినా రక్షణ చర్యలు తీసుకోవాల్సిందే. ఆదమరుపుగా ఉన్నామా మునిగిపోతామంతే..



ఇలాగే రాయించండి : ముక్కొల్లు చెక్‌డామ్ వద్ద హెచ్చరిక బోర్డులు రాయిస్తున్న పోలీసులు



చూస్తుండగానే వెళ్లిపోతారు.జాగ్రత్త : తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గురువారం స్నానాలు చేస్తున్న సందర్శకులు

పేరులోనే గోదావరి ఉన్న జిల్లా మనది.. నీటికి లోటు లేదు.. ఆ నీటిలో జరిగే ప్రమాదాలకు కొదువే లేదు. ప్రతి ఏటా 50 మంది వరకూ నదీ ప్రమాదాల్లో మృత్యుపడుతున్నారంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నది ఏదైనా పైకి ప్రశాంతంగానే కనిపిస్తుంది.. దిగితేనే దాని లోతు తెలుస్తుంది.. ప్రస్తుత వేసవి నేపథ్యంలో నదీ స్నానాలకు వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉంటుంది.. గోదావరి.. కాలువలు. సముద్రతీర ప్రాంతం ఇలా ఎక్కడపడితే అక్కడ సరదాగా స్నానాలకు క్యూకడుతుంటారు. వేసవి కావడంతో అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందడానికి ప్రతి రోజు వేలాది మంది స్నానాలు ఆచరిస్తుంటారు. ఈ సరదాలో ప్రమాదాలను గుర్తించలేక పలువురు మృత్యువాత పడిన ఘటనలు అనేకం. ఇటీవల శివరాత్రికి తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడి వద్ద గోదావరిలో స్నానం చేద్దామని వెళ్లి ఐదుగురు యువకులు మృత్యువాత పడ్డారు. బుధవారమే చూస్తే కాకినాడ జిల్లాలో కాండ్రకోట, పెద్దనాపల్లి వద్ద ఏలేరు కాలువలో స్నానానికి దిగి నలుగురు యువకులు మృత్యువాత పడ్డారు. వేసవి సెలవుల్లో సరదాకు స్నానాలు సరే కానీ ఆదమరుపుగా ఉన్నామా మిగిలేది మాత్రం కన్నీళ్లే..



ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు : పెద్దనాపల్లిలో మృతదేహాన్ని పట్టుకుని కుటుంబీకుల రోదన

ఈత సరదా..పొంచి ఉన్న ముప్పు

రక్షణ చర్యలు చేపట్టండి

నదీ పరీవాహక ప్రాంతాల్లో అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. నది లోతు.. జరిగే ప్రమాదం.. తదితర విషయాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలి. కాలువ రేవులు, ఘాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదకరంగా ఉండే గోదావరి ఘాట్ల వద్ద సచివాలయ పోలీసులు నియమించాలి. కాటన్ బ్యారేజీ కిందకు వెళ్లే దారులన్నీ మూసివేయాలి. ప్రధాన కాలువల్లో జరిగిన ప్రమాదాలతో ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. గోదావరి ఘాట్ల వద్ద కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే అప్రమత్తంగా ఉంటారు.

- ప్రమాదకరంగా గోదారి ఘాట్లు
- కాలువలదీ ఇదే పరిస్థితి
- కానరాని కనీస రక్షణ చర్యలు
- వేసవి తాపంతో పెరిగిన తాకిడి
- బుధవారమే నలుగురు మృతి
- అయినా పట్టని అధికారులు
- ఇకనైనా మేల్కొనాల్సిందే



సరదాలు వద్దు నాయనా : అల్లవరం వద్ద సముద్రతీరంలో చిన్నారుల ఈత సరదా

ఈత సరదా.. కాదు!

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు/ఆత్రేయపురం: ఉమ్మడి జిల్లాలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతం చాలా ఎక్కువ. ఇటు తూర్పుగోదావరి.. అటు కోనసీమ జిల్లా లను ఆనుకుని గోదావరి ప్రవహిస్తుంది. వేసవి వచ్చిందంటే పిల్లలతోపాటు పెద్దలు గోదావరి స్నానాలకు క్యూకడుతుంటారు. కొవ్వూరు, రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ఉంటుంది. ఈ నేపథ్యంలో లోతు ఎక్కువ. కొవ్వూరు గోష్పాదక్షేత్రం.. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్, గౌతమి ఘాట్, అయ్యప్ప ఘాట్లు, ధవళేశ్వరం బ్యారేజీ, జొన్నాడ తదితర ప్రాంతాల్లో స్నానాలు ఎక్కువగా చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో గతంలో ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో ప్రతి ఏటా పర్యాటకులు వేలాదిగా స్నానాలు చేస్తుంటారు. ప్రతి ఏటా పదుల సంఖ్యలో యువకులు మృత్యువాతపడి తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలిస్తున్నారు. గతేడాది మే నెలలో ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి ఎందరో చనిపోయారు. ఊబలున్న చోట పైకి గోదావరి చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది దిగితేనే దాని లోతు తెలిసేది. పుష్కరాల రేవులో చాలామంది పిల్లలు, పెద్దలు లోతు తెలియక దిగి మృత్యువాతపడిన సందర్భాలున్నాయి. పడవలపై గోదావరి మధ్యలోకి వెళ్లి లంకల్లో దిగి స్నానాలు చేస్తున్నవారున్నారు. అయినా నేటికీ రక్షణ చర్యలు కానరావడం లేదు. రోజురోజుకు సందర్శకులు పెరుగుతున్నా ఏ ఒక్కరూ రక్షణపై దృష్టి సారించడంలేదు.



వేసవి ఉపశమనం..గోదారి : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద గోదావరిలో స్నానాలు

కన్నీట.. కాలువలు

పిఠాపురం/ ప్రత్తిపాడు/కిర్లంపూడి/ పెద్దాపురం : కాలువలు ప్రమాదకరంగా మారుతున్నాయి.. లోతు తెలియకుండా దిగి ఎంతో మంది మృత్యువాతపడుతున్నారు. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల ఏలేరు,పీబీసీ కాలువలు ఉన్నాయి. వర్షాకాలంలో సుద్దగడ్డ కాలువ ప్రమాదకరంగా ఉంది. ఏలేరు కాలువలో పిడిందొడ్డి, ఎదురొడ్డి, గొల్లప్రోలు కాలువలతోపాటు బల్లకట్టు, భోగాపురం గుమ్మిడిగట్టు రెగ్యులేటర్, గొల్లప్రోలు, చిత్రాడ, నవఖండ్రవాడ, మల్లవరం, యండపల్లి తదితర ప్రాంతాల్లోని పీబీసీ కాలువలు, గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ కాలువ, చెందుర్తి, కొడవలి వద్ద పుష్కర, పోలవరం కాలువల వద్ద పలు ప్రమాదాలు చోటు చేసుకుని గత ఐదేళ్లలో 19 మంది మృత్యువాతపడ్డారు. ఏలేశ్వరం ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఏలేరు ఎడమ కాలువ ప్రమాదభరితంగా మారింది. పెదశంకర్లపూడి, రౌతుపాలెం,పెద్దిపాలెం, గజ్జెనపూడి, యుజేపురం తదితర చోట్ల స్నానాలకు కాలువలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.పొదురుపాక, గజ్జెనపూడి, చింతలూరు పరిసరాల్లో అనేక ప్రమాదాలు జరిగాయి. కిర్లంపూడి మండలం ముక్కొల్లు,పెద్దాపురం మండలం కాండ్రకోట ఏలేరు బెడ్ రెగ్యులేటర్ల వద్ద ప్రమాదకరంగా ఉంది. రెండు చోట్లా ఇప్పటివరకూ 30 మంది మృత్యువాతపడడమే అందుకు ఉదాహరణ.

ప్రమాదాల తీరం..

అల్లవరం : సముద్ర తీరం చూస్తే ఎవరికి స్నానం చేయాలనిపించదు మరి. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, అల్లవరం, అంతర్వేది తదితర ప్రాంతాల్లో సముద్రతీర ప్రాంతాలు ఉన్నాయి. వేసవి కావడంతో కొందరు యువకులు సముద్ర స్నానాలకు దిగి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. అల్లవరం, కాకినాడ సముద్ర తీర ప్రాంతాల్లో పలు ప్రాంతాల నుంచి కుటుంబీకులతో బీచ్‌కు చేరి సముద్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఓడలరేవు తీరంలో మెరైన్ పోలీసులు గస్తీ తిరుగుతున్నా కొందరు యువత వారిని కాదని లోతుకు వెళ్లి మృత్యువాతపడుతున్నారు. తీరాన అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతి.

ముస్లింల హక్కుల సంరక్షణకే

వక్ఫ్ సవరణ బిల్లు

- విపక్షాల అభ్యంతరాలు అర్థరహితం
- బిల్లుకు జనసేన సంపూర్ణ మద్దతు
- లోక్‌సభలో కాకినాడ ఎంపీ ఉదయ్

(ఆంధ్రజ్యోతి, కాకినాడ)

ముస్లింలహక్కులు కాపాడడంతోపాటు, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు వక్ఫ్ సవరణ బిల్లు దోహదం చేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. బుధవారం లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు-2025పై జరిగిన చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా వక్ఫ్ బోర్డుకు కోట్లు విలువజేసే 36.18లక్షల ఎకరాల భూమి ఉన్నా సరైన చట్టం, పర్యవేక్షణ లేకపోవడంతో వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. గతంలో వివాదాస్పద భూములకు సంబంధించి వక్ఫ్ ట్రిబ్యునల్ నిర్ణయమే అంతిమం కావడంతో దీర్ఘకాలిక వివాదాలు, ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌తో బాధితులకు అన్యాయం జరిగిందన్నారు. వాస్తవానికి తొలుత వక్ఫ్ సవరణ బిల్లులో జిల్లా న్యాయమూర్తి చైర్మన్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వంలో జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారి ఉండేలా ట్రిబ్యునల్ పునర్నిర్మించాలని ప్రతిపాదించారని, ముస్లిం మేధావుల వినతి మేరకు జాయింట్ పార్లమెంటరీ కమిటీలో చర్చించి ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు ఉంటే 90 రోజుల్లో హైకోర్టులో అప్పీలు చేసుకోవడానికి సవరణ బిల్లు అవకాశం కల్పిస్తుందని, తద్వారా బాధిత పక్షాలకు మరింత మేలు జరుగుతుందని అన్నారు. గతంలో కలెక్టర్‌లేదా డిప్యూటీకలెక్టర్‌కు సర్వే బాధ్యత అప్పగించాలని ప్రతిపాదించగా విస్తృతమైన సమీక్షల తర్వాత వక్ఫ్‌ఆస్తుల వివాదాలపై విచారణ నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ స్థాయి కంటే పై అధికారిని నియమించాలని జేపీసీ సూచించిందన్నారు. వక్ఫ్ ఆస్తుల నోటిఫైడ్ జాబితాను రాష్ట్ర ప్రభుత్వాలు అధికారిక గెజిట్లో ప్రచురించిన 15రోజుల్లోపు పోర్టల్లో అప్లోడ్ చేయాల్సి ఉండగా, ఆ సమయాన్ని 90రోజులకు పొడిగించాలని జేపీసీ సిఫారసు చేసిందని గుర్తుచేశారు. సవరణ బిల్లు ఆమోదంతో మరింత జవాబుదారీతనం, పారదర్శకతతో వక్ఫ్ బోర్డు బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తంచేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నాయకత్వంలో జనసేన అణగారిన వర్గాలకోసం పాటుపడుతోందని, సవరణబిల్లు ద్వారా ముస్లిం వర్గాల హక్కులకు మరింత రక్షణ కలుగుతుందని విశ్వసిస్తూ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. బిల్లును తీసుకురావడానికి సహకరించిన ప్రధాని మోదీ, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజీజులకు ఎంపీ ఉదయ్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు, రేపు ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన



ప్రారంభానికి సిద్ధమైన గొల్లప్రోలులోని అర్బన్‌హెల్త్ సెంటర్ భవనం

- తొలి అధికారిక అడుగు పిఠాపురంనుంచే..
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు శుక్ర, శనివారాల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత రాష్ట్రంలో తొలి అధికారిక పర్యటనకు ఇక్కడ నుంచే శ్రీకారం చుడుతున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రెండురోజుల పర్యటనకు గురువారం రాత్రి పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌కు నాగబాబు చేరుకున్నారు.

పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్ర, శనివారాల్లో ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌లతో కలిసి ఎమ్మెల్సీ నాగబాబు గొల్లప్రోలులో నూతనంగా నిర్మించిన తహసీల్దారు కార్యాలయం, అర్బన్ హెల్త్ సెంటర్ భవనాలను శుక్రవారం ప్రారంభిస్తారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌ను ప్రారంభించి రూ.5కే భోజనం, టిఫిన్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. గొల్లప్రోలు వాటర్‌వర్క్స్‌లో రూ.78లక్షలతో చేపట్టిన వివిధ పనులను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తారు. అక్కడినుంచి పిఠాపురం చేరుకుని పాదగయక్షేత్రం సమీపంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో నిర్వహించిన పనులను ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడతారు. అక్కడే లబ్ధిదారులకు ఎల్‌పీసీలు పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మలతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని మునిసిపల్ కమిషనర్ కనకారావు తెలిపారు.సాయంత్రం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంలో సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తారు.

శనివారం పిఠాపురం మండలం కుమారపురం,విరవ, గోకివాడగ్రామాలు, గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట, వన్నెపూడి, కొత్తపల్లిమండలం కొత్తపల్లి,ఉప్పాడ, కొత్తమాయపట్నం, అమరవిల్లి గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లతోపాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. వీటికి సంబంధించి అధికారయంత్రాంగం విస్తృత ఏర్పాట్లుచేసింది. ఎమ్మెల్సీగా నాగబాబు తొలిఅధికారిక పర్యటనను ఇక్కడినుంచే ప్రారంభిస్తుండడంతో జనసేన శ్రేణులు విజయవంతం చేసేందుకు సన్నద్ధమవుతున్నాయి.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతం చేయాలి

- సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్
- జిల్లాలో మొదటి ధాన్యం కొనుగోలు కేంద్రం
- సామర్లకోట మండలం జి.మేడపాడులో ప్రారంభం



మొదటి ధాన్యం కొనుగోలు టోకెన్ స్లిప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, పక్కనే సివిల్ సప్లయిస్ రాష్ట్ర చైర్మన్ సుధీర్, జేసీ రాహుల్

సామర్లకోట,ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కొనుగోలు ప్రక్రియను విజయవంతంచేయాలని రాష్ట్రసివిల్‌సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సీతారామసుధీర్ అన్నారు. జిల్లాలో మొట్టమొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సామర్లకోట మండలం జి.మేడపాడు పీఏసీఎస్ ఆవరణలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 36.14 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని రైతులనుంచి నేరుగా కొనుగోళ్లు చేయడమే గాక ధాన్యం సరఫరా చేసిన 24 గంటల్లో రైతు ఖాతాకు డబ్బులు జమ చేశామన్నారు. ఇదే రీతిలో ఈ ఏడాది రబీ సీజన్‌లో కూడా రైతులనుంచి ధాన్యం కొనుగోళ్లు చేస్తామన్నారు. రైతులు అపరా పంటల సాగువైపు కూడా శ్రద్ధ కనబర్చాలన్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డులు క్యూఆర్‌కోడ్ విధానంలో పంపిణీ చేసేందుకు అన్ని సన్నాహాలు చేశామన్నారు. రాష్ట్రంలో 3,930 ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు, 47,394 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకం అమలుకు జూన్‌నెలనుంచి సన్నబియ్యాన్ని సరఫరా చేస్తామని చైర్మన్ సుధీర్ తెలిపారు. జేసీ రాహుల్‌మీనా మాట్లాడుతూ జిల్లాలో అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన గోనె సంచులు, సాంకేతిక పరిజ్ఞానం, సిబ్బంది సమకూర్చినందున 5.57 లక్షల మెట్రిక్‌టన్నుల మేర ధాన్యాన్ని రైతులనుంచి కొనుగోలు చేస్తామన్నారు. బయట ప్రైవేట్ మార్కెట్లో రైతులకు ధాన్యం ధర గిట్టుబాటుగా ఉంటే విక్రయించుకునే స్వేచ్ఛ రైతులకు కల్పించామన్నారు. రైతులు ధర విషయంలో నష్టం వాటిల్లకుండా కృషిచేస్తుందన్నారు. రైతుల వద్ద ఎంత ధాన్యం ఉన్నా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఎదురైతే మండల స్థాయిలో కానీ, జిల్లాస్థాయిలో కానీ ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు. అనంతరం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రైతులనుంచి ధాన్యం కొనుగోలులో రైతులు డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటువంటి సమస్యలు లేనేలేవన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొచ్చేందుకు రైతులు వెనుకాడవద్దని చెప్పారు. సమావేశంలో కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్, కాకినాడ పార్లమెంటరీ తెలుగురైతు కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, సివిల్ సప్లయ్ జిల్లామేనేజరు దేవులనాయక్ ప్రసంగించారు. తొలిధాన్యం కొనుగోలులో భాగంగా రైతు పాలకుర్తి వీరభవన్నారాయణకు టోకెన్ స్లిప్‌ను ఎమ్మెల్యే చినరాజప్ప, సివిల్‌సప్లయిస్ చైర్మన్ తోటసుధీర్, కుడా చైర్మన్ తుమ్మలబాబు అందజేశారు. కాకినాడ పార్లమెంటరీ తెలుగు రైతు కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, గుమ్మళ్ల రామకృష్ణ, తోటకూర శ్రీనివాస్, ఏడీఏ రత్నప్రశాంతి, ఎంఏవో ఐ.సత్య, పీఏసీఎస్ సీఈవో రవికుమార్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో జడ్జి బంగ్లా ప్రారంభం



ప్రత్తిపాడు సబ్ జైలు రిజిస్టరులో సంతకం చేస్తున్న జిల్లా జడ్జి గంధం సునీత

ప్రత్తిపాడు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు కోర్టు సమీపంలో నూతనంగా నిర్మించిన జడ్జి బంగ్లాను జిల్లా జడ్జి గంధం సునీత గురువారం ప్రారంభించారు. ప్రత్తిపాడు కోర్టుకు విచ్చేసిన ఆమెకు న్యాయమూర్తి కాటం భాను, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, కార్యదర్శి మధుబాబు, మాజీ బార్ అధ్యక్షులు కె.వీర్రాజు, పి.పుల్లయ్య, బుగతా శివ, చలంకూరి రామకృష్ణ స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. జడ్జి నివాస క్వార్టర్స్, భవన సముదాయాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక సబ్‌జైలును జిల్లా జడ్జి సునీత సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. సబ్‌జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, ఆహార విషయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమాల్లో న్యాయవాదులు పి.నాగేంద్రరాజు, మల్లేశ్వరరావు, జోగేష్, కామేష్, మంజూషా, శివకుమార్, ప్రసన్నకిషోర్, సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం, ఆర్అండ్‌బీ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


శ్రీరామగిరిలోని యాగ రామాలయం

అదిగో... అదిగో... శ్రీరామగిరి



శ్రీరామగిరి... ఆధ్యాత్మికంగా, చారిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి పొందిన ఏకైక దక్షిణముఖ ఆలయమిది. సాక్షాత్తూ రామలక్ష్మణులు ఇక్కడ సంచరించినట్టు రామ కథ చెప్తోంది. పురాణంలో శ్రీరామగిరి అతి ముఖ్యమైన ఘట్టంలో ఒకటిగా ఉంది. రావణుడు సీతమ్మవారిని అపహరించిన క్రమంలో ఆమె జాడ కోసం రామలక్ష్మణులు అడవిబాట పడతారు. ఆ సమయంలో కొన్ని మూగజీవాలు చేసిన సంజ్ఞలతో సీతమ్మవారిని రావణుడు అక్కడి నుంచి దక్షిణ దిశగా అపహరించినట్టు రామలక్ష్మణులకు అర్థమవుతుంది. దీంతో ఆ దిశగా అన్వేషించిన తర్వాత సీతమ్మ కోసం వెళ్లే ముందు గోదావరి నది ఒడ్డున రామలక్ష్మణులు ఓ ఎత్తైన కొండపై చాతుర్మాస్య దీక్ష చేస్తారు. దీంతో ఆ ప్రాంతం శ్రీరామగిరిగా వినుతికెక్కింది.

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశంలోనే మాతంగి మహర్షి, ఆయన శిష్యులు, రుషులు శ్రీసీతారామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించినట్టు వాల్మీకి రామాయణంలోని అరణ్యకాండలో పొందుపర్చిన శ్రీరామదివ్య చరిత ద్వారా తెలుస్తోంది. మరెక్కడా లేనంత స్థాయిలో అత్యంత సుందరంగా ఆ విగ్రహాలను తీర్చిదిద్దడంతో శ్రీరామగిరిలో ప్రతిష్ఠించిన రాముడు సుందరరాముడిగా పిలవబడుతుంటాడు. అంతే కాదు రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశంలో ఆలయం నిర్మించినందునే యాగ రామాలయంగా ప్రసిద్ధి పొందింది. ఇంతటి విశిష్టత కలిగి ఉన్న ఈ ఆలయం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ వర రామచంద్రపురం మండలంలో 80 అడుగుల ఎత్తులో ఉన్న కొండపై నిర్మితమైంది. ఇక్కడప్రతిఏటా రాముని కల్యాణాన్ని ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

రాముని వనవాసంలో ముఖ్య భూమికలైన జటాయువు, రేఖపల్లి, ఉష్ణగుండాలు, వాలిసుగ్రీవులు, రామలక్ష్మణుల వృక్షాలు, శ్రీరామపాద ముద్రలు, చుక్కనపల్లి లాంటి చారిత్రక దృశ్యాలను భక్తులు నేటికీ అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు.


ఎటపాకలోని జటాయువు మందిరం

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రికి కూతవేటు దూరంలో ఉన్న నేటి ఎటపాకే నాటి జటపాక. సీతారాముడు వనవాసం చేస్తున్న సందర్భంలో జటాయువు రాముని వద్దకు వచ్చి తాను దశరథుని శిష్యుడిగా పరిచయం చేసుకుంటుంది. తదుపరి రామా నీవు ఆశ్రమంలో లేని సమయంలో సీతమ్మ వారికి రక్షణగా ఉంటానని మాటిస్తాడు. ఆ మేరకు మాయాలీలుడైన రావణుడు సీతమ్మవారిని అపహరించుకెళ్తున్న సమయంలో అడ్డుపడి శక్తి వంచన లేకుండా యుద్ధం చేస్తాడు. అయితే అత్యంత బలశాలి అయిన రావణుడి ఖడ్గం ధాటికి జటాయువు రెక్కలు, కాళ్లు తెగిపోతాయి. ఓ రెక్క జటపాకలోను, మరో రెక్క రేక్కపల్లిలోను పడిపోతాయి. చివరకు రెండు కాళ్లూ తెగిపోయిన జటాయువు యుద్ధంలో అలసిపోయి రాముడిని స్మరిస్తూ నేలకూలుతుంది. జటపాక నేడు ఎటపాకగా, రెక్కపల్లి వర రామచంద్రపురం మండలంలోని రేఖపల్లిగాను, చొక్కిపోయి నేలకూలిన ప్రదేశం చొక్కనపల్లిగా పిలవబడుతున్నాయి.

రావణుడి అకృత్యాన్ని రాముడికి చెప్తూ జటాయువు తుది శ్వాస విడుస్తాడు. దీంతో జటాయువు అంత్య సంస్కారాలు చేయడం రామలక్ష్మణులు తమ విధిగా భావిస్తారు. ఈ క్రమంలో లక్ష్మణుడు గోదావరి ఒడ్డున చితి పేర్చగా రాముడు చితికి నిప్పు అంటిస్తాడు. దశరథుడు సైతం పొందని ఘన మైన రామునిచేత అంతిమ సంస్కారాలు పొందిన పుణ్యాత్ముడిగా జటాయువు నిలిచాడు. రాముడు చితికి నిప్పు అంటించిన ప్రదేశంలో (గోదావరి ఒడ్డున) రాళ్లపై రామపాద ముద్రలు నేటికీ కనిపిస్తాయి.

- భారతదేశంలోనే ఏకైక దక్షిణ ముఖ ఆలయం
- సాక్షాత్తూ రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశమిది
- ఉష్ణగుండాలు, ఎటపాక, రేఖపల్లి
- రామాయణ ఇతివృత్తంతో ముడిపడి ఉన్న ఆధ్యాత్మిక ప్రదేశాలివి






తమ ప్రాంతంలో సంచరించిన రామలక్ష్మణులకు గుర్తుగా ఆదివాసీలు వరరామచంద్రపురం మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో రామ, లక్ష్మణుల పేరిట రెండు టేకు చెట్లు నాటినట్టు చరిత్ర చెప్తోంది. ఏపుగా పెరిగి వున్న అవి నేటికీ మనకు కనిపిస్తాయి.

ఎటపాక మండలం గుండాల సమీపాన గోదావరి తిన్నెలో ఉష్ణ గుండం నేటికీ మనకు కనిపిస్తుంది. ఆ గుండం నుంచి ఎప్పుడూ వేడి నీరే వస్తుంది. సీతమ్మ వన వాస సమయంలో శీతాకాలం రావడంతో గోదావరి నీరు చల్లగా ఉండి స్నానమాచరించేందుకు ఆమె ఇబ్బంది పడడాన్ని లక్ష్మణుడు గుర్తించి గోదావరి ఇసుక తిన్నెలోకి బాణాన్ని సంధిస్తాడు. ఆ ప్రదేశంలో ఏర్పడిన గుండం నుంచి వేడినీరు వచ్చినట్టు ప్రతీతి. ఇప్పటికీ ఆ ప్రదేశాన్ని స్థానికులు భక్తుల సందర్శనార్థం ముక్కోటి, శ్రీరామనవమి పర్వదినాల్లో అందుబాటులోకి తెస్తున్నారు.





అన్నదమ్ములైన వాలి, సుగ్రీవులు రామాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తూర్పు కనుమల్లో తల దాచుకోవ డంతో అక్కడున్న కొండలను వాలిసుగ్రీవుల కొండలుగా పిలుచుకుంటారు.


వర రామచంద్రపురం మండలంలో గోదావరి ఒడ్డున ఉన్న శ్రీరామగిరి గ్రామం




శిశిరం... నవ వసంతం

ఆకురాలు కాలం (శిశిరం) వెళ్లింది... చిగురించే కాలం (వసంతం) వచ్చింది.... నవ వసంతంలో చెట్లు శోభను సంతరించుకున్నాయి... కాకినాడ పిండాల చెరువు వద్ద కొద్ది రోజుల క్రితం ఆకులన్నీ రాలి కళావిహీనంగా కనిపించిన రావి చెట్టు నేడు కళకళలాడుతూ కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది. ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ


కాకినాడ బీచ్ రోడ్డులో గో కార్టింగ్ రేస్ ట్రాక్

గో... గో... రయ్... రయ్...

- కాకినాడ సాగర తీరంలో గోకార్ట్ రేసింగ్
- సిద్ధమవుతున్న ట్రాక్
- ఈ నెలలోనే అందుబాటులోకి...

కాకినాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)

కాకినాడ సాగర తీరం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడికి వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా గడిపేలా పలు సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ వినోదాన్ని పంచేలా ఎమ్యూజ్‌మెంట్ పార్కును అందుబాటులోకి తీసుకొస్తున్నారు. పర్యాటకులకు ఆటవిడుపుగా ఉండేలా.. రాష్ట్ర పర్యాటక శాఖ, స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. తాజాగా కాకినాడ, పరిసర ప్రాంతవాసులకు గోకార్ట్ కార్ రేసింగ్ అందుబాటులోకి రానుంది. కాకినాడ బీచ్‌కు దగ్గరలో సుమారు ఐదున్నర ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ పనులు



పూర్తి కావొస్తున్నాయి.

గో కార్టింగ్‌తో పాటు 46 ఎమ్యూజ్‌మెంట్ యాక్టివిటీస్ వస్తున్నాయి. అందులో హ్యూమన్ గైరో, క్రికెట్, 50 ఫీట్ జెయింట్ స్వింగ్, వీఆర్ గేమ్స్, గో కార్టింగ్‌లో అత్యంత అధునాతన వాహనాలను తీసుకొస్తున్నారు. అన్ని రకాల ఫుడ్ కౌంటర్స్, మెకనైజ్డ్ క్రికెట్, పెయింట్ బాల్, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్ వంటి క్రీడలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. పర్యాటకులకు ఎంట్రీ ఫ్రీ అని, రూ.300తో గోకార్టింగ్ యాక్టివిటీ మొదలవుతుందని గోకార్టింగ్ ఏరియా మేనేజర్ శ్రావణ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.


జోరుగా నిర్మాణ పనులు

నేడు అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన


పోలీసులకు సూచనలిస్తున్న సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

- కూటమి ప్రభుత్వంతో సంస్కృతీ, కళలకు పునరుజ్జీవం
- ప్రదర్శనల రాబడితో దామెర్ల ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధి
- 500కిపైగా కళాకారుల నమోదు
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలి
- రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

రాజమహేంద్రవరం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): కళలకు కాణాచి వంటి రాజమహేంద్రవరంలో అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు సెంట్రల్ జైలు రోడ్డులో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని.. ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి తిలకించాలని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి అన్నారు. గురువారం ఆమె ఏర్పాట్లను పరిశీలించి పోలీసు తదితర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే సంస్కృతి, కళలకు పునరుజ్జీవం వచ్చిందన్నారు. వాటికి పూర్వవైభవం తీసుకురావాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. సెంట్రల్‌జైలురోడ్డులో శుక్రవారం నిర్వహించనున్న అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు 500మంది కళాకారులు నమోదు చేసుకున్నారన్నారు. వారి చిత్రకళలు ప్రదర్శనలో ఉంటాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచి కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చే నిధులతో రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని అభివృద్ధి చేస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళలు, సంప్రదాయాలకు ఆదరణ లభించలేదని, వాటి పునరుద్ధరణకు ఏ ప్రయత్నమూ జరిగిన దాఖలాలు లేవని విమర్శించారు. ఎంతో గొప్ప కళాకారులు, పద్మ అవార్డుల వంటి ఉన్నత పురస్కారాల గ్రహీతలకు సైతం అప్పట్లో సముచిత గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కమిషన్ డైరెక్టర్ అండ్ సీఈవో మల్లిఖార్జు నరావు, కలెక్టర్ పి.ప్రశాంతి, పాల్గొన్నారు.

చిత్ర కళా ప్రదర్శన ప్రదేశం

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలురోడ్డులో సెంట్రల్ జైలు నుంచి ఆర్ట్స్ కళాశాల వరకూ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో.

సమయం: ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు. ప్రవేశం ఉచితం.

ట్రాఫిక్ ఆంక్షలు

రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి సీటీఆర్ఐ జంక్షన్ వరకూ సెంట్రల్‌జైలు రోడ్డులో లాలాచెరువు వైపునుంచి వచ్చే కార్లు, బస్సులు, ఇతరవాహనాలు క్వారీ మార్కెట్, మార్కెట్‌యార్డు రోడ్డు, కంబాల చెరువు గుండా ఆర్ట్స్ కళాశాల చేరుకుని పార్క్ చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలు సీటీఆర్ఐ వరకూ రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కి అడ్డం లేకుండా నిలపవచ్చు. కంబాలచెరువునుంచి లాలాచెరువు వెళ్లే వాహనాలు మార్కెట్ యార్డు రోడ్డులో క్వారీ మార్కెట్ సెంటర్‌కి వెళ్లి అక్కడినుంచి లాలాచెరువు చేరుకోవాలి. శుక్రవారం రాత్రి 10గంటల వరకూ ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి.



వసూళ్లు అంతంతే!

లక్ష్యానికి ఎంతో దూరంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పన్నుల వసూలే లక్ష్యంగా కొన్ని నెలలుగా శ్రమిస్తున్న మున్సిపల్ అధికారులు ఆ లక్ష్యానికి చేరువయ్యారా? మొండి బకాయిలను వసూలు చేయగలిగారా? మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఈ సందర్భంగా అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేశారా? మున్సిపాలిటీలకు గుదిబండగా మారిన బకాయిల భారాన్ని కాస్తయినా 2024-25 ఆర్థిక సంవత్సరంలో దించుకోగలిగారా? అంటే లేదు అనే సమాధానమే వినిపిస్తోంది. పన్నుల వసూలులో కొన్ని మున్సిపాలిటీల్లో వెనుకబడ్డారని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని కీలకమైన కాకినాడ నగరపాలక సంస్థ, పిఠాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లో 50శాతం మేర మాత్రమే వసూళ్లు చేయడమే నిదర్శనం.

కాకినాడ జిల్లాలో...

ఆర్థిక సంవత్సరం ముగిసింది. పన్నుల వసూలుకు నిర్దేశించిన గడువు తీరింది. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో కాకినాడ జిల్లాలోని పలు మునిసిపాలిటీలు వెనుకబడ్డాయి. ప్రభుత్వం 50శాతం వడ్డీ మాఫీ కల్పించినా ప్రజల నుంచి అంతంతమాత్రమే స్పందన రాగా, కొన్ని మున్సిపాలిటీల్లో ఆశించిన ఫలితం లభించింది. కాకినాడ నగరపాలక సంస్థలో కొన్ని చోట్ల కుళాయిల కనెక్షన్లు కట్ చేసినా.. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లో దుకాణాలను సీజ్ చేసినా 50 శాతంలోపు మాత్రమే పన్నులు వసూలు చేయగలిగారు. కాకినాడ జిల్లాలో కాకినాడ నగరపాలక సంస్థ, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలతో పాటు ఏలేశ్వరం, గొల్లప్రోలు వంటి రెండు మేజర్ నగర పంచాయతీలు కూడా ఉన్నాయి. వీటిలో గొల్లప్రోలు నగర పంచాయతీ 76.71శాతం, పెద్దాపురం 65.81శాతంతో లక్ష్యానికి కాస్త చేరువయ్యాయి. కొన్ని మున్సిపాలిటీల్లో వసూళ్లశాతం తక్కువగా ఉండడానికి దీర్ఘకాలంగా ఉన్న కోర్టు కేసులు కూడా మరో కారణం. మొండిబకాయిదారుల ముక్కుపిండి వసూలు చేస్తామని చెప్పిన నగరపాలక రెవెన్యూ అధికారులు.. వెనుకబడ్డారు. సెలవు దినాల్లో సైతం పన్ను చెల్లింపు కౌంటర్లు తెరిచినా.. 50 శాతానికి చేరువకాలేకపోయారు. కాకినాడ నగరపాలక సంస్థను పరిశీలిస్తే.. ఇక్కడ పన్ను వసూలు లక్ష్యం రూ.110.99 కోట్లు. అందులో పాతబకాయిలు రూ.56.42 కోట్లు ఉన్నాయి. ప్రస్తుత బకాయిలు రూ.54.58కోట్లు.. ఇప్పటివరకు రూ.52.97కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.58.02 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అంటే 47.72 శాతం మాత్రమే వసూలైంది. కనీసం 50 శాతానికి కూడా చేరువకాలేకపోయింది. ఇక్కడ పన్నుల వసూలుపై నగరపాలక అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్‌కు పన్ను వసూలు బాధ్యత అప్పగించిన కమిషనర్ భావన ప్రతి శనివారం పన్ను వసూళ్ల ప్రగతిపై సమీక్షించేవారు. అంతేకాదు.. పన్ను వసూలుపై పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేపట్టారు. నగరంలో 200కిపైగా కుళాయి కనెక్షన్లను తొలగించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లోని 11కిపైగా దుకాణాలను సీజ్ చేశారు. పన్నులు చెల్లించని ఖాళీస్థలాల వద్ద జప్తు చేస్తామంటూ హెచ్చరిక బ్యానర్లు తగిలించారు. ఆటోల్లో ప్రచారం, ఐవీఆర్ఎస్ ద్వారా ఇంటి యజమానుల మొబైల్‌కు ఫోన్ చేసి అప్రమత్తం చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఇక ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం మున్సిపాలిటీలో మొత్తం పాత బకాయిలు రూ.5.58 కోట్లు, ప్రస్తుత బకాయిలు రూ.4.59కోట్లు కలిపి మొత్తం పన్ను బకాయిలు రూ.10.17కోట్లు కాగా, అందులో రూ.4.97కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ.5.20 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అంటే 48.90శాతమే ఈ మున్సిపాలిటీలో పన్నులు వసూలయ్యాయి. గొల్లప్రోలు నగర పంచాయతీలో పన్ను వసూల లక్ష్యం రూ.1.82 కోట్లు కాగా రూ.1.39కోట్లు వసూలైంది. 76.71 వసూలు శాతం నమోదైంది. కాకినాడ జిల్లాలో ఈ నగర పంచాయతీయే పన్నుల వసూలులో ముందంజలో ఉంది. సామర్లకోట మున్సిపాలిటీలో పన్నుల వసూలు లక్ష్యం పాత, ప్రస్తుత బకాయిలు రూ.8.78 కోట్లు కాగా అందులో రూ.4.47కోట్లు వసూలైంది. ఇంకా రూ.4.31 కోట్ల బకాయిలున్నాయి. ఇక్కడ 50.93శాతం పన్నులు వసూలయ్యాయి. పెద్దాపురం మున్సిపాలిటీలో పన్ను వసూలు లక్ష్యం పాత, ప్రస్తుత బకాయిలు కలిపి రూ.7.18కోట్లు కాగా రూ.4.72కోట్లు వసూలైంది. రూ.2.45కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ పన్ను వసూలు శాతం 65.81 శాతంగా నమోదైంది. ఏలేశ్వరం నగర పంచాయతీలో పాత, ప్రస్తుత బకాయిలు రూ.2.61కోట్లు కాగా అందులో రూ.1.49కోట్లు వసూలయ్యాయి. రూ.1.12కోట్ల బకాయిలున్నాయి. ఇక్కడ పన్ను వసూలు శాతం 57.12. ఇక తుని మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత బకాయిలు మొత్తం రూ.7.28 కోట్లుకాగా, రూ.5.09 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.2.19కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ 69.92 శాతం పన్ను వసూలైంది.

తూర్పుగోదావరి జిల్లాలో...

తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు సంబంధించి పాత, ప్రస్తుత పన్ను బకాయిలు రూ.132.32 కోట్లు కాగా రూ.71.09 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.61.22 కోట్లు వసూలు కావాల్సి ఉంది. 53.73 శాతం పన్ను వసూలు నమోదైంది. కొవ్వూరు మున్సిపాల్టీ మొత్తం పన్నుబకాయిలు రూ.4.56 కోట్లు కాగా రూ.3.69కోట్లు వసూలయ్యాయి. రూ.0.86కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ 81.04 శాతం వసూలైంది. నిడదవోలు మున్సిపాల్టీకి సంబంధించి మొత్తం పన్ను బకాయిలు రూ.8.47కోట్లు కాగా రూ.4.72కోట్లు వసూలైంది. ఇంకా రూ.3.75 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ 55.72 శాతం వసూలైంది.

కోనసీమ జిల్లాలో...

అమలాపురం మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత ఆస్తి పన్ను బకాయిలు రూ.14.72కోట్లు కాగా.. రూ.9.01కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.5.71 కోట్ల మేర బకాయిలున్నాయి. ఇక్కడ 61.94 శాతం పన్ను వసూలయ్యాయి. రామచంద్రపురం మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత బకాయిలు రూ.7.65 కోట్లు కాగా వసూలైంది రూ.4.93కోట్లు, వసూలు కావాల్సింది రూ.2.72 కోట్లు ఇక్కడ పన్ను వసూలు శాతం 64.46. మండపేట మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత బకాయిలు రూ.8.37 కోట్లు కాగా వసూలైంది రూ.6.42, వసూలు కావల్సింది రూ.1.95 కోట్లు, ఇక్కడ పన్నువసూలు శాతం 76.73 శాతం. ముమ్మిడివరం నగర పంచాయతీలో పన్ను వసూలు లక్ష్యం రూ.1.81కోట్లు కాగా రూ.1.37 కోట్లు వసూలైంది. రూ.0.45 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ పన్ను వసూలు శాతం 75.42 శాతం.


మండపేట మున్సిపాలిటీ

రాష్ట్రంలో కొవ్వూరుకు ఆరు.. మండపేటకు పదో స్థానం

మండపేట, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుల వసూళ్లకు సంబంధించి రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కొవ్వూరు మున్సిపాలిటీకి ఆరో స్థానం లభించింది. ఇక్కడ 81.04 శాతం సాధించి రికార్డు సృష్టించింది. మొత్తం రూ.4.56 కోట్ల లక్ష్యానికిగాను రూ.3.69 కోట్లు వసూలయ్యాయి. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేటలో ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి రాష్ట్రంలో పదో స్థానాన్ని పొందింది. ఇక్కడ 76.73 శాతం సాధించింది. మొత్తం రూ.8.37 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యంకాగా రూ.6.42 శాతం వసూలైంది. కోనసీమ జిల్లాలో మండపేటకు పన్నుల వసూళ్లలో ప్రథమ స్థానం లభించిందని మున్సిపల్‌కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు.

కర్పూర ధర అధరహో

● గరిష్ఠంగా రూ.500 పైమాటే

● ఎగుమతులు పెరిగాయి..

దిగుమతులు తగ్గాయి



రావులపాలెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతంలో మెట్ట రైతులు అరటిసాగులో కర్పూర రకం అరటిని ఎక్కువగా సాగుచేస్తుంటారు. ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు ఈ రకం అరటిగెలలు ఎగుమతులు అవుతుంటాయి. అక్కడి వ్యాపారులు గెలల కొనుగోలు కోసం వచ్చిన సమయంలో రైతులకు ధరలు అనుకూలంగా ఉంటాయి. రెండు నెలల క్రితం అరటి ధరలు బాగా పతనం కావడంతో రైతులు దిగాలు పడ్డారు. కాగా మార్చి మొదటివారం నుంచి కర్పూర రకం అరటికి డిమాండ్ పెరిగింది. అమ్మవారి జాతర్లు, తీర్థాలు, శుభ ముహూర్తాలు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు ఉండటంతో రోజురోజుకీ ధర పెరిగి రైతులకు ఊరట కలిగించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు రైతులు సైకిళ్లు, మోటార్‌సైకిళ్లపై అరటి గెలలను తీసుకువచ్చి విక్రయిస్తారు. జనవరి నుంచి మొదలుకుని మార్చి మొదటి వారం వరకూ కర్పూర రకం అరటి గెల రూ.200 నుంచి రూ.250 వరకూ మాత్రమే పలకడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కాగా మార్చి మొదటి వారం నుంచి గరిష్ఠంగా కర్పూర రకం అరటి గెల రూ.500 పలుకుతుండటంతో రైతులు ఊరట చెందుతున్నారు. దిగుబడి పుష్కలంగా ఉన్న సమయంలో ధర లేదు.. దిగుబడి తగ్గిన సమయంలో ధర పలుకుతుందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక అరటి మార్కెట్ యార్డు నుంచి ఒడిషా, భువనేశ్వర్, కటక్, విశాఖపట్నం, తెలంగాణాతో పాటు పలు ప్రాంతాలకు నిత్యం 10వేల కర్పూర రకం అరటి గెలలు ఎగుమతి అవుతున్నాయి.

గోలి శ్యామలకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గోలి శ్యామల జనవరి నెలలో విశాఖపట్నం నుంచి సముద్రంలో ఈదుతూ కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు విజయవంతంగా చేరారు. ఆమె సాహసాన్ని అభినందిస్తూ ఓల్డ్ ఓపెన్ వాటర్ అసోసియేషన్ ప్రశంసాపత్రం అందజేసింది. ఈ నేపథ్యంలో శ్యామల గురువారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 150 కిలోమీటర్లు సముద్రంలో ఈదుతూ గమ్యాన్ని చేరుకోవడం గొప్ప విశేషమని కలెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినంధించారు.



శ్యామలను అభినంధిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

రూ.171.33కోట్లతో సత్యదేవుడి ఆలయ బడ్జెట్



● రెగ్యులర్ ఉద్యోగుల జీతాలు పింఛన్లు, ఇతర ఉద్యోగుల జీతాలకు రూ.46.25కోట్లు

● ప్రసాదం తయారీ ముడిసరుకులకు రూ.25కోట్లు ● ఉత్సవాలకు రూ.1.57కోట్లు

● ప్రసాదం ప్యాకర్లు, వ్రతపురోహితులు, నాయిబ్రాహ్మణుల రెమ్యునరేషన్‌కు రూ.19.70 కోట్లు

● భక్తుల సౌకర్యాలకు రూ.7.64కోట్లు ● ప్రభుత్వానికి వివిధ చెల్లింపుల ఖర్చు రూ.23.30కోట్లు

● ఆమోదం తెలుపుతూ దేవదాయ కమిషనర్ ఉత్తర్వులు

అన్నవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.171.33కోట్లతో ఆలయ బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతూ దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బడ్జెట్‌కు అనుగుణంగానే వ్యయం చేయాల్సి ఉంటుంది. వీటిలో 3వ వంతు రూ.46.25కోట్లు రెగ్యులర్ ఉద్యోగుల జీతాలు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల పింఛన్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల చెల్లింపులకు కేటాయించారు. రెమ్యునరేషన్ పద్ధతిపై పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు, వ్రతపురోహితులు, ప్రసాదం ప్యాకర్లకు రూ.19.70కోట్లు చెల్లింపునకు ఆమోదం లభించింది. స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు, తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ తదితర ఉత్సవాల నిర్వహణకు ఈఏడాదిలో రూ.1.57కోట్ల వరకు ఖర్చుచేసుకునే వీలు కల్పించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించే శానిటేషన్ నిర్వహణ, హౌస్‌కీపింగ్, చలువపందిళ్ల ఏర్పాటు, తదితర వాటికి రూ.7.64కోట్లు మంజూరయ్యాయి. రూ.1.63 కోట్లు విద్యుత్‌బిల్లుల చెల్లింపు, నిర్వహణ, ఎలక్ట్రికల్ గూడ్స్ కొనుగోలు, నీటిసరఫరాకు రూ.1.63 కోట్లు కేటాయింపులు జరిగాయి. ట్రాన్స్‌పోర్టు నిర్వహణకు రూ.1.16కోట్లు, రూ.5.03కోట్లతో దత్త ఆలయాలు, విద్యాసంస్థల నిర్వహణ, వేదపాఠశాల, వైద్య సదుపాయాలకు వెచ్చించాలని స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రూ.5.35కోట్లు ఆలయ భద్రతకు విధులు నిర్వహించే హోంగార్డులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు చెల్లించనున్నారు. రూ.23.30 కోట్లను సీజీఎఫ్, ఆడిట్ ఫీజు ఇతర పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించేందుకు కేటాయించారు. భక్తుల సౌకర్యాలకోసం వివిధ నిర్మాణాలకు రూ.4కోట్లు, ఎలక్ట్రికల్, వాటర్‌వర్క్స్ కోసం రూ.5కోట్లు కేటాయించారు. రూ.6.43కోట్లను అన్నదాన విభాగం నిమిత్తం మంజూరయ్యాయి. వీటితో ప్రావిజన్స్, కూరగాయల కొనుగోలు, అన్నదాన విభాగ సిబ్బంది జీతాలకు ఆమోదం లభించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో స్వామివారి ఆదాయానికి వ్యయానికి సరిచూసుకుని రూ.3కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా చేయాలని సూచించారు.

రత్నగిరి రామయ్య కల్యాణానికి పందిరిరాట

సత్యదేవుడి ఆలయ క్షేత్రపాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల కల్యాణానికి ప్రారంభ సూచికగా గురువారం ఉదయం 9.30 గంటలకు అర్చకస్వాముల మంత్రోచ్చారణల నడుమ పందిరిరాటను నెలకొల్పారు. ఈనెల 5 నుంచి శ్రీరామనవమి వేడుకలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. 6వ తేదీ మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో సీతమ్మ మెడలో రామయ్య మూడుముళ్లు వేయనున్నారు. వేడుకలు 13వ తేదీతో ముగుస్తాయి. పందిరరాట కార్యక్రమం లో ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.



రాములోరి కల్యాణానికి శాస్త్రోక్తంగా పందిరరాట వేస్తున్న పండితులు, పాల్గొన్న ఈవో

వాడపల్లిలో బెల్లపు బట్టీలలో విజిలెన్స్ తనిఖీలు

● రూ. 38 లక్షల విలువైన పంచదార, బెల్లం, రసాయనాలు స్వాధీనం

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరిజిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి, బంగారంపేట గ్రామాలలో బెల్లపు బట్టీలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. బెల్లపు బట్టీలలో కల్తీ జరుగుతుందని రీజనల్ విజిలెన్స్ అధికారి ఎన్.స్నేహితకు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ టి.తాతారావు పర్యవేక్షణలో రెండు బృందాలుగా విజిలెన్స్ అధికారులు కొవ్వూరు మండలంలోని బెల్లపు బట్టీలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిషేధిత రంగులు, రసాయణాలు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. రూ.38లక్షల విలువైన పంచదార, బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వాడపల్లిలో 36,500 కేజీల పంచదార, 2324 కేజీల నాసిరకం బెల్లం, బంగారంపేటలో 2800 కేజీల పంచదార, 486 కేజీల నాసిరకం బెల్లంతోపాటు బెల్లం తయారీలో ఉపయోగించే నిషేధిత రంగులు, ఇతర రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్లపు తయారీ కోసం పొయ్యిలలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేసి తగులబెడుతున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బెల్లాన్ని, పంచదారను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ మధుబాబు మాట్లాడుతూ కొవ్వూరు పరిసర ప్రాంతాలలో బెల్లంతయారీలో కల్తీ జరుగుతుందని విజిలెన్స్ రీజనల్ అధికారి ఎన్.స్నేహితకు సమాచారం వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు వాడపలిల్లో బండి శ్రీనివాసరావు బెల్లపు బట్టీ, బంగారంపేటలో ఆనందరావు తనిఖీలు చేపట్టారన్నారు. ఏవిధమైన అనుమతులు లేకుండా బంగారంపేటలో నిర్వహిస్తున్న బెల్లపు బట్టీపై విజిలెన్స్ ఏజి లక్ష్మీనారాయణ, ఫుడ్ రెండవ బృందం వాడపల్లి ఆనందరావు బెల్లపు బట్టీలో గ్రామంలో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ మధుబాబు, టి.నాగ వెంకటరాజు, ఫుడ్ సేఫ్టీ అధికారి రుత్తయ్య లీగల్ మెట్రాలజీ అధికారి ప్రసాద్, కార్మిక శాఖ, రెవెన్యూ, పంచాయితీ అధికారులు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న బెల్లం, పంచదారను రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.



వాడపల్లిలో బెల్లపు బట్టీలలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

● 16 కిలోలు స్వాధీనం

ధవళేశ్వరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి అతడి నుంచి 16కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. హర్యాణా రాష్ట్రం పరితాబాద్ జిల్లాకు చెందిన జగదీష్ వైజాగ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలుచేసి హర్యాణా రాష్ట్రానికి తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు సీఐ టి.గణేష్ సిబ్బందితో దాడిచేసి జగదీష్‌ను అరెస్టుచేసి అతడి నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. కోర్టుకు తరలించగా రిమాండ్ విధించింది. ఈకేసులో నిందితుడిని అరెస్ట్‌చేసిన సీఐ గణేష్, సిబ్బందిని ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.



గంజాయితో పాటు నిందితుడిని పట్టుకున్న పోలీసులు

నాలుగు ఎక్స్‌కవేటర్లు సీజ్

● జిల్లా మైన్స్ అధికారి భూషణ్‌రెడ్డి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం కొత్తతుంగపాడులో సర్వేనెం 792లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేస్తున్న ప్రదేశాన్ని జిల్లా గనులు, భూగర్భశాఖ, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా తనిఖీ చేశారు. తవ్వకాలు చేస్తున్న 4 ఎక్స్‌కవేటర్లను సీజ్ చేశామని జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తవ్వకాలు జరిపిన భూమి వివరాలను పూర్తిగా విచారించిన తర్వాత తవ్వకాలు జరిపిన వారిపై తనిఖీ చేసే అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారని తెలియజేశారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన ధ్యానం లారీ

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం నుంచి కె.గంగవరంనకు ఏటిగట్టు మీదుగా ధాన్యంలోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి కపిలేశ్వరపురం పుష్కరరేవు వద్ద ఏటిగట్టును ఆనుకుని ఉన్న హోటల్‌లోకి దూసుకువెళ్లింది. హోటల్ నిర్వాహకుడు మోటుపల్లి వెంకటరమణ హోటల్‌లోకి బుధవారంరాత్రి సుమారు ఒంటిగంట ప్రాం తంలో లారీ దూసుకుపోవడంతో షెడ్డుతోపాటు వంట సామగ్రి పూర్తిగా దెబ్బతింది. రాత్రి సమయంలో హోటల్‌లో నిర్వాహకులు అక్కడలేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. హోటల్ నిర్వహించే పగలు సమయంలో ఇది జరిగి ఉంటే భారీ నష్టం జరిగేదని పలువురు తెలిపారు. బ్రేకుపడకపోవడంవల్ల అదుపుతప్పి హోటల్‌లోకి లారీ దూసుకుపోయి నట్లు డ్రైవరు సతీష్ తెలిపాడు. దీనిపై కేసు నమోదు కాలేదు.



కపిలేశ్వరపురంలో హోటల్‌లోకి దూసుకెళ్లిన ధాన్యంలోడు లారీ

తల్లి, చెల్లిపై దాడి ఘటనలో.. అన్న, వదినపై కేసు నమోదు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తల్లిని, చెల్లిని కొట్టి గాయపర్చిన అన్న, వదినపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ వి.లలిత తెలిపారు. పట్టణంలోని అచ్చయమ్మకాలనీకి చెందిన మిండల లక్ష్మీ తల్లికి రూ.50వేలు అందాయని తెలుసుకున్న అన్న గంగరాజు, అతని భార్య ముత్తమ్మ ఇంటికి వచ్చారు. గంగరాజు తల్లిని రూ. 50 వేలు కావాలని అడిగాడు, దీంతో ఆమె నిరాకరించడంతో తల్లిని, చెల్లిని గంగరాజు, ముత్తమ్మ ఇటుకరాయితో కొట్టి గాయపర్చారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. మిండల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ లలిత తెలిపారు.

పిల్లలను దృఢంగా ఉండేలా సన్నద్ధం చేయాలి

● ప్రవేశ పరీక్షలపై 'తిరుమల'లో జరిగిన అవగాహన సదస్సులో తిరుమలరావు

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన లభించిందని విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సదస్సుకు విద్యార్థులు, తల్లిదండ్రులు సుమారు 18 వేల మంది హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను మానసికంగా కాకుండా, శారీరకంగా, ధృడంగా ఉండేలా సన్నద్ధం చేయాలని అప్పుడే వారి పిల్లలు వృద్ధిలోకి వస్తారన్నారు. జాతీయస్థాయి పరీక్షలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్‌లలో తరచూ విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాల కన్నా ఎలక్ట్రానిక్ పరికరాలు ఎక్కువగా అలవాటు పడ్డారని వారి పుస్తకాలతో కన్నా మొబైల్ ఫోన్లతో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టంపై తల్లిదండ్రులు వివరించాలని తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులే మొదటి గురువులు అని, వారిని చూసి పిల్లలు నేర్చుకుంటారని పిల్లల నడవడికను చిన్నతనం నుంచే తల్లిదండ్రులు వారికి నేర్పాలన్నారు. విజ్ఞాన భారతి నేషనల్ సెక్రటరీ సుబ్బరాయశర్మ మాట్లాడుతూ పిల్లల్లో ఆలోచనా విధానం, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలంటే పుస్తకాలు ఎక్కువచదవాలన్నారు. సదస్సులో అకడమిక్ డైరెక్టర్లు సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు

పి.రాయవరంలో జాతీయస్థాయి నాటికల పోటీలు ప్రారంభం



నాటికల పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న నాటక పరిషత్ ప్రతినిధులు, నాయకులు

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలోని మాదేపల్లి శ్రీరామమూర్తి కళా వేదికపై మూడు రోజుల పాటు జరిగే 5వ జాతీయ స్థాయి నాటికల పోటీలు గురువారంరాత్రి ప్రారంభమయ్యాయి. సీతారామాలయ పునర్నిర్మాణ పంచమ వార్షికోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రోత్సాహంతో శ్రీరామచంద్ర నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను పరిషత్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో నాటక పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్నీడి జగ్గారావు, నాగాభట్ల బాపన్నశాస్త్రి, సీతారామ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాదేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు కాకినాడ సాయికార్తీక్ క్రియేషన్స్ కళాకారులు ఎడారిలో వాన చినుకు, చిన్న తిరుపతి శృంగార వల్లభ ఆర్ట్స్ కళాకారులు కబ్జా నాటికలను ప్రదర్శించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కాకినాడ నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొండబాబు, ప్రత్యేక అతిథిగా లలితా ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాసు విచ్చేశారు. కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పులవర్తి కుమార్, యక్కల ప్రసాద్, కోనసీమజిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వాకచర్ల సత్యానారాయణ, బచ్చు ప్రభాకర్, కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని శ్రీరామసత్యానారాయణ ప్రమాణం చేయించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సత్యానారాయణ మాట్లాడుతూ ఆన్‌లైన్ మాల్స్ వల్ల వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, అందుకు అనుగుణంగా వ్యాపారాల అభివృద్ధిపై ఆర్యవైశ్యులు దృష్టిపెట్టాలన్నారు. ఆర్యవైశ్య కులస్తులకు రాజకీయాలకతీతంగా సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్రంధి నారాయణరావు (బాబ్జీ), నాయకులు బచ్చు శేఖర్, దంగేటి సతీష్, బచ్చు రాజేష్, ఎస్. మోహన్‌కుమార్, ఎ.గంగరాజు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో చోరీకి పాల్పడిన దొంగ అరెస్టు

● అమ్మవారి మంగళ సూత్రాలు, శ్రీనివాసుడి వెండి కిరీటం, చెవులు స్వాధీనం

రాయవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చోరీకి పాల్పడి జైలుకి వెళ్లి వచ్చిన బుద్ధి మార్చుకోని వ్యక్తి రెండు ఆలయాల్లో తిరిగి చోరీలకు పాల్పడగా దొంగను రాయవరం పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం గతనెల 31న రాయవరం శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి మెడలో బంగారు మంగళ సూత్రాలు అపహరణకు గురయ్యాయి. ఆలయ పూజారి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన పోలీసులు విశ్వేశ్వరస్వామి ఆలయం ప్రక్కనే ఉన్న పోలమ్మ అమ్మవారి ఆలయం వద్ద సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఫుటేజ్ ఆధారంగా దొంగ రంగంపేట మండలం నల్లమిల్లి గ్రామం ముత్యాలమ్మ ఆలయ సమీపంలో తోరాటి సాయి వరప్రసాద్‌గా గుర్తించారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ దొరరాజు పర్యవేక్షణలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గురువారం రాయవరం-మహేంద్ర రోడ్డులో పాత గ్యాస్ కంపెనీ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు విచారణ చేయగా అన్నపూర్ణ అమ్మవారి ఆలయంలో మంగళసూత్రాలతో పాటు ఈనెల 1న బిక్కవోలు మండ లం పందలపాక గ్రామంలో కాలువగట్టున ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వెండి కిరీటం, వెండి చెవులు అపహరించినట్లు సాయివరప్రసాద్ నేరాన్ని అంగీకరించారు. చోరీకి పాల్పడిన సాయి వరప్రసాద్ నుంచి రెండు బంగారు మంగళసూత్రాలు, సుమారు 1250 గ్రాముల వెండి కిరీటం, వెండి చెవులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సాయి వరప్రసాద్‌పై రాయవరం పోలీస్‌స్టేషన్‌లో గతంలో సోమేశ్వరం బాపనమ్మ అమ్మవారి ఆలయంలో చోరీకి పాల్పడి జైలుకి వెళ్లి వచ్చాడని ఎస్ఐ తెలిపారు. చోరీలకు పాల్పడిన సాయివరప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అనపర్తి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్‌బాబు

మనస్తాపంతో ఉరి వేసుకుని వ్యక్తి మృతి



రొక్కాల మోజెష్(ఫైల్)

అంబాజీపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో భర్త మనస్తాపం చెంది ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం పరిధిలోని లీజర్‌కాలనీకి చెందిన రొక్కాల మోజెస్ (34)కు తన భార్యతో వారంరోజుల క్రితం మనస్పర్థలు ఏర్పడ్డాయి. మోజెష్ భార్య వారంరోజుల క్రితం తన పాపను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి మోజెష్ ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. తన ఏడాదిన్నర కుమార్తెకు ఐ మిస్‌యూ బంగారు తల్లి అని స్టేటస్ పెట్టుకున్నాడు. అనంతరం తన బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మోజెష్ మృతి చెందాడు. మోజెష్ ఇంకా నిద్రలేవలేదని స్థానికులు కిటికీలోంచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండటాన్ని స్థానికులు గమనించారు. దీంతో తలుపులు పగులగొట్టి చూసేసరికి అప్పటికే మోజెష్ మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

గోపాలపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని మహిళ మృతి చెందిన సంఘటన తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం మండలంలోని సంజీవపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నందిగూడెం గ్రామంలో బుధవారం రాత్రి చేటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కొంతమంది కూలీలను నంది గూడెం గ్రామశివారులో ఉన్న కాకర్ల దివాకర్, సంజీవ్ కుమార్‌లకు చెందిన కోళ్లఫామ్‌లో కూలిపని చేసేందుకు పెట్టుకున్నారని అన్నారు. గత సంవత్సర కాలంగా వాళ్లు అదే కోళ్లఫామ్‌లో పనిచేస్తున్నారని, అదే క్రమంలో సతామి కోటల్ (30) భర్త సునీల్ కోటల్ ఇరువురు పనిచేసే క్రమంలో ఈనెల జీతాన్ని సునీల్‌కోటల్ మొదటి భార్యకు రూ.5వేలు వేయడంతో మనస్తాపానికి గురైన సతామికోటల్ తాము నివాసం ఉంటున్న గదికి గెడ వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. దీంతో తోటి కూలీలు తలుపులు పగులగొట్టి ఫ్యాన్‌కు వేలాడుతున్న సతామికోటల్‌ను కిందకు దింపి చూడగా అప్పటికే ఆమె చనిపోయిందన్నారు. కోళ్లఫామ్ యజమాని ఇచ్చిన సమాచారం మేరకు నందిగూడెం వీఆర్వో కొత్తపల్లి రాంబాబు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పి.గన్నవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరం మండలానికి చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.... మండలంలోని ఓ గ్రా మానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఇటీవలే 10వ తరగతి పరీక్షలు రాసింది. అయితే బుధవారం మధ్యాహ్నం టీవీ చూడటానికి వెళ్తున్నానని తల్లికి చెప్పి పక్క నివాసానికి వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోవడంతో చుట్టుపక్కలా, బ ంధువులు ఇళ్లవద్ద వాకబుచేసి ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలుడి అదృశ్యం..



పాలూరి వెంకట ఫణీంద్ర (ఫైల్)

కోటనందూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లి గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... కాకరాపల్లి గ్రామానికి చెందిన పాలూరు బెన్నేష్ కుమారుడు వెంకట ఫణీంద్ర రాత్రి 7-30 నిమిషాలకు బహిర్భూమికి వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా తిరిగి రాకపోవడంతో ఈరోజు ఉదయం తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసునమోదు చేసినట్టు తెలిపారు.

యువతి అదృశ్యం...



షేక్ నాగీనా (ఫైల్)

కోటనందూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం కాకరపల్లికి చెందిన యువతి అదృ శ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... షేక్ మీరాబికి చెందిన కూతురు షేక్ నాగీనా బుధవారం సాయంత్రం 6.30కు చెవిరింగులు కొనడానికి కోటనందూరు సెంటర్‌కి వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. సెంటర్‌లో వెతికినప్పటికీ కనబడకపోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు.

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ

కాకినాడరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియార్టీ జాబితాను www.deoe g.org వెబ్‌సైట్, నోటీస్ బోర్డులలో ఉంచామని డీఈవో పి.రమేష్ తెలిపారు. దీనిపై అభ్యంతరాలుంటే ఈనెల 4నుంచి 11వ తేదీ సాయంత్రంలోపు సరైన ఆధారాలతో విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

రేపు జగజ్జీవన్‌రామ్ జయంతి

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ 117వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు ఇంద్రపాలెంలోని లయన్స్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్ వద్ద ఉన్న గల జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని చెప్పారు.



కాకినాడ రూరల్ గంగనాపల్లిలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో రవికుమార్

గ్రామాలను ప్లాస్టిక్‌రహితంగా తీర్చిదిద్దాలి

కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ సూచన

కాకినాడ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను ప్లాస్టిక్, చెత్త రహితంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ సూచించారు. గంగనాపల్లి, కొవ్వాడల్లో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించి కార్యదర్శులు, క్లాప్‌మిత్రలకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటించారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ వచ్చి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారా, పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది మొదలైన విషయాలను అడిగారు. ఈవోపీఆర్డీ ఎంఎస్ ఆంజనేయులు, పంచాయతీల కార్యదర్శులు కె.శ్రీనివాస్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: గ్రామాల్లో ప్రతిరోజూ ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ చేయాలని కాకినాడ డీఎల్పీవో అన్నామణి ఆదేశించారు. జిల్లాలో ర్యాండమ్ పద్ధతిలో ఎంపిక చేసిన గొల్లప్రోలు మండలం చేబ్రోలు, తాటిపర్తి గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించి ఇంటింటా చెత్తసేకరణ జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. రోడ్లపై చెత్తాచెదారం వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈవోపీఆర్డీ కుమార్, పంచాయతీ కార్యదర్శులు రాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలకు నిరసనగా సీపీఎం ధర్నా

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం భారీగా విద్యుత్ భారాలు వేస్తోందని నిరసన తెలుపుతూ నగరంలోని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా నేత దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమన్న హామీని చంద్రబాబు మరిచారని విమర్శించారు. అదానీకి లాభాలు చేకూర్చే సెకి ఒప్పందం రద్దు చేయాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. టైం ఆఫ్ ది డే పేరుతో విద్యుత్ కీలకంగా ఉపయోగించే సమయాల్లో యూనిట్ ధర పెంచాలనే ప్రతిపాదన చాలా దారుణమన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్‌భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎం నగర కమిటీ కన్వీనర్ పలివెల వీరబాబు, సభ్యులు మలక వెంకటరమణ, డి.ప్రసాద్‌లతో పాటు చంద్రమళ్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, కె.సత్తిబాబు, తలుపులమ్మ తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



క్షీరాధివాసంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి పాలరాతి విగ్రహాలు

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

కరప, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక నీలయ్యతోట వీధిలో పునర్నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వేడుకగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి పాలరాతి విగ్రహాలను క్షీరాధివాసంలో ఉంచి భక్తులు పాలతో అభిషేకించారు. విగ్రహాల దాత లకమన బాబూరావు-చిట్టెమ్మ దంపతులు, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో యాగశాలలో సర్వదేవతా హోమాలు, పంచశయ్యా ధివాసాలు జరిపారు. శుక్రవారం ఉదయం విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.



పార్కును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్న అగ్రహారం ప్రాంత ప్రజలు

'అగ్రహారం పార్కును అభివృద్ధి చేయాలి'

పిఠాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారం మెట్టపై ఉన్న పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. చెత్తాచెదారం పేరుకుపోయి మందుబాబులకు నిలయంగా ఉన్న పార్కు దుస్థితిని గురువారం చూపించి నిరసన తెలిపారు. 96 సెంట్లలో 2002లో ఏర్పాటు చేసిన ఈ పార్కు అభివృద్ధికి గతంలో రెండు విడతలుగా రూ.26లక్షలు కేటాయించినా నిర్వహణ లేకపోవడంతో డంపింగ్ యార్డుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ పార్కు దుస్థితిపై దృష్టి సారించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ జనపరెడ్డి రాంబాబు, టీడీపీ నాయకుడు అందుగుల సత్తిబాబు కోరారు.



ప్రారంభ సభలో మాట్లాడుతున్న మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు

'ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి'

పెద్దాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిల్డ్రన్స్ క్లబ్, భారత విద్యార్థి ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పెద్దా పురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు కోరారు. పాలిటెక్నిక్ కోచింగ్ ప్రారంభ సభ పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్ద శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం యాసలపు సూర్యారావు భవనంలో జరిగింది. మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి రాజేష్‌కుమార్ దేవత, మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ నరేష్ పెద్దిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకుడు గోపాలకృష్ణ, ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఆరిఫ్ అలీ, నీలపాల బాలమురళీకృష్ణ, రొంగల అరుణ్, అమృత, నమ్రత, డి.కృష్ణసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భావనారాయణస్వామి భూముల పరిరక్షణకు చర్యలు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన భావనారాయణస్వామి ఆలయానికి చెందిన భూములు, ఆస్తుల సంరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గురువారం ఆయన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ లాంఛనాలతో స్వాగతం పలికారు. అనంతరం ఏపీఐఐసీ భూములకు చేర్చి ఉన్న భావనారాయణస్వామికి చెందిన సుమారు 18 ఎకరాల భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవాలయ భూముల వివరాలు, వాటి తాజా పరిస్థితిపై నివేదిక తయారు చేసి ఇవ్వాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు అనువైన భూముల పరిశీలనకు వచ్చినట్టు ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. పర్యటనలో దేవదాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు, ఆర్డీవో మల్లిబాబు, ఈవో ఎం.లక్ష్మీనారాయణ, తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పుల్ల శ్రీరాములు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో కలెక్టర్ షాన్‌మోహన్... కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, టూరిజం శాఖ అధికారులతో కలిసి గురువారం సుడిగాలి పర్యటన చేశారు. బీచ్‌లో జరుగుతున్న పలు అభి వృద్ధి, అసంపూర్తి నిర్మాణ పనులు, బీచ్ క్లీనింగ్, నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాల ఏర్పాటుపై టూరిజం, పంచాయతీ, రెవెన్యూ, కౌడా అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఎన్టీఆర్ బీచ్‌ను సందర్శకులకు అనువుగా అత్యంత సుందరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్, తూడు, ఇతర పిచ్చిమొక్కలు తొలగించి క్లీన్ అండ్ గ్రీన్ బీచ్ పార్కుగా ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పర్యాటక శాఖ ఇన్‌చార్జి అధికారి చైత్రవర్షిణి, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత, కౌడా ఈఈ సీహెచ్ రామారావు, ఏఈ వెంకటేష్, ఎంపీడీవో పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



దేవదాయ శాఖ భూములను మ్యాప్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే నానాజీ

అధికారుల పనితీరుపై సభ్యుల అసంతృప్తి

కరప మండల సమావేశం

కరప, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన కరప మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా మండలంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ప్రగతిని సభ్యులకు వివరించారు. గడిచిన మూడు నెలల కాలంలో శాఖల వారీగా జరిగిన ప్రగతిని అధికారులు వివరించి సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. పలువురు అధికారులతీరుపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య, ఆరోగ్య శాఖాధికారుల తీరును జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు ఎండగట్టారు. సమావేశానికి పీహెచ్‌సీ వైద్యులు సకాలంలో రాకపోవడాన్ని తప్పుపట్టారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీకి ఏ విషయం చెప్పకుండా ఏకపక్ష నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారని ప్రశ్నించారు. మూడు నెలలకోసారి హెచ్‌డీసీ మీటింగ్ పెట్టాలని మరిచారా.. అసలు ఈ కమిటీ ఉందని మీకు తెలుసా... అని కరప పీహెచ్‌సీ వైద్యాధికారి ఏంజెలినాను అడగ్గా నాకు తెలియదని ఆమె చెప్పడంతో సభ్యులు విస్తుపోయారు. వెళ్లిపోయిన వైద్యాధికారి శ్రీనివాసనాయక్ అంతా చూసుకునేవారని, ఇప్పుడిప్పుడే అన్నీ తెలుసుకుంటున్నానని ఆమె సంజాయిషీ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. గృహనిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పలు గ్రామాల సభ్యులు ఏకరువు పెట్టారు. ఇచ్చిన ఇళ్ల పట్టాలు, పొజిషన్, ఇతర సమస్యలపై ధ్వజమెత్తారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, వ్యవసాయ, విద్యుత్ శాఖలకు సంబంధించిన పలు అంశాలను సభ్యులు లేవనెత్తి ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సముచిత గౌరవం ఇవ్వాలని, ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమావేశంలో ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, తహసీల్దారు నందిపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌కు

ఉచిత శిక్షణ

పిఠాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాసే వారి కోసం నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అక్కుల మురళీ సూచించారు. పిఠాపురంలోని కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఆయన గురువారం ప్రారంభించారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ప్రతి రోజూ శిక్షణతో పాటు వారానికి రెండు రోజులు టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు. సబ్జెక్టుల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని పరీక్ష తేదీకి ముందుగానే సన్నద్ధం కావాలని కోరారు. తరగతులకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

పరీక్షా కేంద్రాల ఆకస్మిక తనిఖీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల్లో డిగ్రీ, బీఈడీ, న్యాయవిద్య పరీక్షలు జరుగుతున్న సందర్భంగా కాకినాడ జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనికి సంబంధించి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాకినాడలోని పీఎస్ఎల్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రగతి డిగ్రీ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను వీసీ తనిఖీ చేశారు. అలాగే కాకినాడలోని నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌ను, కార్యాలయాలను, వసతి గృహాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పీజీ అడ్మిషన్లు జరుగుతున్న నేపథ్యంలో అన్ని సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది క్రమశిక్షణతో సమయపాలన పాటించాలని, విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. వసతి గృహాన్ని సందర్శించిన వీసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహాన్ని, మెస్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 15 మందికి జైలు, ముగ్గురికి జరిమానా

సామర్లకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని తనిఖీలు చేయగా నిబంధనలు అతిక్రమించిన 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. గురవారం వారిని కాకినాడ మూడవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి ముందు హాజరుపర్చగా 15 మందికి ఒక్కొక్కరికీ మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ తెలిపారు. మరో ముగ్గురికి ఒక్కొక్కరికీ రూ.10వేలు జరిమానా విధించారు.



టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

తెలుగుదేశం పార్టీలో పలువురి చేరిక

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో గోకివాడ పంచాయతీ పరిధిలోని జగపతిరాజపురం బూత్ కన్వీనర్ మడికి రవి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు గాందారపు లక్ష్మణరావు, 30 మంది టీడీపీలో చేరారు. వారందరికీ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నామా పెద్దిరాజు, లక్ష్మీనారాయణ, మడికి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

'పుంత రోడ్డు నిర్మాణం చేపట్టాలి'

గొల్లప్రోలు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) పొలాల నుంచి పంట తెచ్చుకునేందుకు వీలుగా పుంత రోడ్డు నిర్మించాలని గొల్లప్రోలు, సీతానగరం, చేబ్రోలు, మల్లవరం తదితర గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం గొల్లప్రోలు వచ్చిన 'పాడా' ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. మల్లవరం కాలువ గట్టు నుంచి సీతానగరం పొలిమేర వరకు ఆరు కిలోమీటర్ల మేర పుంత ఉందని తెలిపారు. ఇది ఎడ్ల బళ్లు, ట్రాక్టర్ల రాకపోకలకు వీలుగా లేకపోవడంతో ధాన్యం బస్తాకు రూ.200 వ్యయం చేసి పొలాలు నుంచి తీసుకువస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. ఇందుకు స్పందించిన పాడా పీడీ చైత్రవర్షిణి ఉపాధి హామీ పథకంలో పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించాలని ఏపీడీ వసంతమాధవి, ఏపీవో గంగాభవానీలను ఆదేశించారు. పుంతను సర్వే చేయిస్తామని తెలిపారు.



పుంత రోడ్డు నిర్మాణం చేపట్టాలని చైత్రవర్షిణిని కోరుతున్న నాలుగు గ్రామాల రైతులు

అవిశ్వాసం అంటూ అవమానిస్తున్నారు

సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ కన్నీటిపర్యంతం

సామర్లకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తనకు ఎటువంటి గౌరవం ఇవ్వకుండా వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, ఆయన తండ్రి సుబ్బారావు అవమానిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ వాపోయారు. సొంత పార్టీ నాయకులే తన పట్ల తీవ్ర అనుచిత వైఖరి అవలంబించారని ఆమె కన్నీటిపర్యంతమన్నారు. వైసీపీకి చెందిన సుమారు 22 మంది కౌన్సిలర్లు తనను చైర్‌పర్సన్ పదవి నుంచి తొలగించాలని కలెక్టర్‌కు బుధవారం లేఖ అందజేసిన ఘటనపై చైర్‌పర్సన్ అరుణ గురువారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం మూడు నెలలు మాత్రమే చైర్‌పర్సన్ పదవిలో ఉండాలని, తదుపరి ఎంపిక చేసిన వారికి పదవి అప్పగించాల్సి వస్తుందని తొలుత తన సంతకాలు తీసుకున్న విషయం వాస్తవమేనని అంగీకరించారు. హఠాత్తుగా తొలగించేందుకు అవిశ్వాస తీర్మానం కోరడం విడ్డూరంగా ఉందన్నారు. పదవికి గానీ, వైసీపీకి గానీ రాజీనామా చేయబోనని, టీడీపీలో చేరేది లేదని చైర్‌పర్సన్ అరుణ స్పష్టం చేశారు. సమావేశంలో జి.కృష్ణమూర్తి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కాటూరి జానకిరామ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అరుణ

ధాన్యం కొనుగోలు సిబ్బందికి

వేతనాల బకాయిలు చెల్లించాలి

సామర్లకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సొసైటీల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్వహించే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాల బకాయిలు తక్షణం చెల్లించాలని కోరుతూ జి.మేడపాడులో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు గురువారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా మొత్తం రూ.2 కోట్లకు పైబడి బకాయిలు చెల్లించాల్సి ఉందని వినతిపత్రంలో పేర్కొనగా జేసీ స్పందించారు. సిబ్బంది వేతనాల సమస్యకు మరో రెండు రోజుల్లో పరిష్కారం లభిస్తుందని జేసీ రాహుల్ మీనా భరోసా ఇచ్చారు.

7న జాబ్ మేళా

కాకినాడ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వికాస, కాకినాడ పీఆర్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.తిరుపతి తెలిపారు. ఇంటర్ ఒకేషనల్, ఐటీఐ ఉత్తీర్ణులైన 29 ఏళ్ల లోపు విద్యార్థులకు ఐటీసీ లిమిటెడ్ కంపెనీలోని ఆహార విభాగంలో ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాలకు 77993763333 నెంబరును సంప్రదించాలని సూచించారు.

దుస్తులు, కళ్లజోళ్లు పంపిణీ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రెడ్ కాన్వెంట్ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 95 మంది పేదలకు కాకినాడ లయన్స్ క్లబ్‌లో ఉచితంగా దుస్తులు, కళ్లజోళ్లను పూర్వ విద్యార్థులు కల్యాణి, ప్రసాద్ గురువారం పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రతిఏటా 1,500 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టీ రమణమూర్తి, శ్రీను, జరీనా పాల్గొన్నారు.

స్వర్ణ పతకాల విజేతకు అభినందన

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ అండ్ మెడికల్ సైన్సెస్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న కాకినాడకు చెందిన షబీనున్నీసా బేగం సెమిస్టర్లలో ఆరు స్వర్ణ పతకాలు సాధించింది. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు గురువారం తన నివాసంలో విద్యార్థిని తండ్రి, టీడీపీ సభ్యుడు సయ్యద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎండీ ఖాన్, ఎస్‌కే రహీమ్, ఎండీ అన్సర్, ఆయుషా, ఫైసల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పెద్దాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరులో జలజీవన్ మిషన్ పథకం ద్వారా మంచినీటి చెరువులో సుమారు రూ.30లక్షలతో చేపట్టబోయే అభివృద్ధి పనులను ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.భారతి గురువారం పరిశీలించారు. ఆమె వెంట డీఈ స్వామి, ఏఈ వెంకటశ్రీరామ్, కూటమి నేతలు మేడిది శ్రీనివాస్, అడపా గంగాధర్, భువనాసి గంగాధర్ వున్నారు.

మూడు రోజుల్లో రూ.5 లక్షల ఆదాయం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తిలోని పెద్ద చెరువులో చేపలు పట్టి విక్రయించడం ద్వారా మూడు రోజుల్లో రూ.5 లక్షల ఆదాయం వచ్చింది. చెరువులో చేపలు పట్టే విషయంలో రెండు మత్స్యకార సంఘాల మధ్య వివాదం నేపథ్యంలో 1, 2, 3 తేదీల్లో తేదీల్లో పోలీసు బందోబస్తు నడుమ మత్స్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు దగ్గరుండి చేపలు పట్టించడంతో పాటు విక్రయాలు జరిపించారు. సుమారు ఐదు టన్నుల చేపలు పట్టుబడగా వాటిని విక్రయించినట్టు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని చెరువు సొసైటీకి జమ చేస్తున్నట్టు చెప్పారు.

బీసీ కార్పొరేషన్ రుణాల అర్జీదారుల స్క్రూట్నీ

పెద్దాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం మున్సిపల్ కార్యాలయంలో స్క్రూట్నీ నిర్వహించినట్టు కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. మొత్తం 1037 మంది దరఖాస్తు చేసుకోగా... బీసీలకు 49, కాపులకు 32, ఈడబ్ల్యుఎస్‌కు 6 యూనిట్లు కేటాయించారు. తొమ్మిది బ్యాంకుల మేనేజర్లతో స్క్రూట్నీ నిర్వహించగా 800 మంది హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఈటీసీకి నలుగురు ఫ్యాకల్టీల నియామకం

సామర్లకోట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో వివిధ శిక్షణలకు నలుగురు జూనియర్ ఫ్యాకల్టీలను నియమిస్తూ ఏపీఎస్ఐఆర్‌డీ (అమరావతి) నుంచి ఉత్తర్వులు జారీ అయినట్టు ఈటీసీ ప్రిన్సిపాల్ జే.వేణుగోపాల్ గురువారం సాయంత్రం తెలిపారు. వారిలో వి.జగన్నాథం గురువారం బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన ముగ్గురూ శుక్రవారం విధుల్లో చేరతారని ప్రిన్సిపాల్ చెప్పారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

ఏలేశ్వరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం నేతృత్వంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. మెయిన్ రోడ్డులో వేసవిని దృష్టిలో ఉంచుకుని డీవీవీ సత్యనారాయణ సహాయంతో గురువారం బాటసారులకు మజ్జిగ అందజేశారు. గోళ్ల నాగేశ్వరరావు, కోరాడ నారాయణరావు, తాళ్లూరి గొల్లాజి, వరుపుల చిట్టిబాబు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత దృష్ట్యా గిరిజన ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. అత్యవసర పరిస్థితులలో మాత్రమే బయటకు వెళ్లాలని సూచించారు. ఎండ వేడిమి దృష్ట్యా సచివాలయాలు, పీహెచ్సీలు, అంగన్వాడీ కేంద్రాలు, ఉపాధి హామీ పథకం చేసే ప్రదేశాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్ ప్యాకెట్లను ఏర్పాటుచేయాలని ఏడీఎంహెచ్వో జి.శిరీషను ఆదేశించారు.

తాగునీటి సమస్యపై చర్యలు చేపట్టండి


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

మారేడుమిల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పడుతున్న తాగునీటి సమస్యపై చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో తూతికి శ్రీనివాస్ విశ్వనాధ్ ఆదేశించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం నుంచి పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మరమ్మతులకు గురైన బోర్లను వెంటనే సరిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్య ఉంటే 63000 35669కు ఫోన్ చేయాలన్నారు. తాగునీటి సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సదరు కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పరిపాలనాధికారి రత్నకుమారి, విస్తరణాధికారి విజయ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన


చేతిపంపు వద్ద ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఎటపాక,ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం అచ్యుతాపురం గిరిజన గ్రామంలో తాగునీటి చేతిపంపు మరమ్మతులకు గురవడంతో తాగునీటికి అవస్థలు పడుతున్నట్లు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన మహిళలు ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలో సోలార్ ట్యాంకు ఉన్నప్పటికీ చార్జింగ్ సమస్యతో తాగునీరు సరఫరా అవడంలేదని తెలిపారు. వేసవి కావడంతో 150 కుటుంబాలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమీపంలో చర్చిలోని తాగునీటి పంపుపై ఆధారపడుతున్నట్లు పేర్కొన్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి గ్రామంలోని తాగునీటి పంపును మరమ్మతులు చేసి, సమస్యను పరిష్కరించాలన్నారు.

ఎటపాకలో వాటర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ఎటపాక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వాటర్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఇ.ప్రేమ్‌సాగర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మోటార్లు, పైపులైన్స్, చేతిపంపులు, ఓవర్ హెడ్ ట్యాంకుల్లో నీటిఎద్దడి సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నెం. 7207012902కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వై.రామవరం, అడ్డతీగలలో వర్షం

● సేదతీరిన ప్రజలు

వై.రామవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురువారం పలుచోట్ల వర్షం పడింది. ఉరుములు, ఈదురుగాలులతో అరగంటపాటు భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షం చల్లదనానికి ప్రజలు సేదతీరారు.

అడ్డతీగల: అడ్డతీగల మండలంలో గురువారం కురిసిన అకాలవర్షంతో ప్రజలు సేదతీరారు. గతవారం రోజుల నుంచి అడ్డతీగలలో ఎండ వేడిమికి అతలాకుతలమవుతున్న ప్రజలు ఈవర్షం ఎండతాపాన్ని తీర్చింది. మండలంలోని బీడుముపాకలు, పాపంపేట, తిమ్మాపురం కోనలోవ, వేటమామిడి తదితర గ్రామాలలో వర్షం కురిసింది. ఈ అకాలవర్షం జీడిమామిడి రైతుకు ఆశాజనకం అని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంవలన జీడిమామిడి పంట దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచించారు.



వై.రామవరంలో కురుస్తున్న వర్షం

సారా స్థావరాలపై ఉక్కుపాదం

● 6,800 బెల్లం ఊట ధ్వంసం, 60 లీటర్ల సారా స్వాధీనం

ఎటపాక, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):అల్లూరి జిల్లా ఎటపాక మండలం గుండువారిగూడెం, పిచుకలపాడు గ్రామాల్లో సారా స్థావరాలపై పోలీసులు, ఎక్సైజ్‌తో పాటు తెలంగాణ ఎక్సైజ్ అధికారులు గురువారం సంయుక్త దాడులు నిర్వహించారు. దాడుల్లో పలుచోట్ల రహస్యంగా దాచిన 6800 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. నవోదయ కార్యక్రమంలో భాగంగా సారా స్థావరాలపై దాడులు జరిపినట్లు సీఐ ఎం.కన్నపరాజు తెలిపారు. 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని పోలీసులు,అధికారులు హెచ్చరించారు.

విలీన మండలాల సమస్యలపై దృష్టి సారించండి


మంత్రిని కలిసిన ఆయుర్వేద వైద్య నిపుణుడు జమాల్‌ఖాన్, సాల్మన్‌రాజు

చింతూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విలీన మండలాల్లో పలు సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా చొరవ తీసుకోవాల్సిందిగా ఆయుర్వేద నిపుణుడు టీడీపీ నాయకుడు జమాల్ ఖాన్ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ని కోరారు. జమాల్ ఖాన్ గురువారం కార్మికశాఖ మంత్రిని అమరావతి సచివాలయంలో కలిశారు. ప్రధానంగా తాగునీటి సమస్య ఉందని, రహదారుల మరమ్మతుకు గురయ్యాయని తెలిపారు. గిరిజనుల రెండో పంట తునికాకు సేకరణకు అటవీ అధికారులకు సూచనలివ్వాల్సిందిగా కోరారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ నాయకుడు పసుపులేటి సాల్మన్ రాజు ఉన్నారు.

● మంత్రి ఎండీ ఫరూక్‌ని పరామర్శించిన జమాల్‌ఖాన్

మైనార్టీశాఖ మంత్రి ఎండీ ఫరూఖ్‌ని ఆయుర్వేద నిపుణుడు జమాల్‌ఖాన్ గురువారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఇంట చోటుచేసుకున్న విషాద ఘటన నేపథ్యంలో జమాల్‌ఖాన్ ఆయనను పరామర్శించారు. పరామర్శించిన వారిలో టీడీపీ నాయకుడు పసుపులేటి సాల్మన్‌రాజు ఉన్నారు.

'రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం'

కిర్లంపూడి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం మండలంలోని తామరాడలో కిర్లంపూడి వ్యవసాయాధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో రైతు జొన్నాల స్వామికి పవర్ టిల్లర్(చిన్న ట్రాక్టర్)ను, రైతులకు మినుముల విత్తనాలు ఉచితంగా అందజేశారు. సోమరాయణంపేటలో మినీ గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, అనుకుల శ్రీకాంత్, చదరం చంటిబాబు, వీరంరెడ్డి కాశీబాబు, నీలం శ్రీను, తూము కుమార్, గుడాల రాంబాబు తదితరులున్నారు.


మంచినీటి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

తామరాడలో మంచినీటి ఉచిత పంపిణీ కేంద్రం ప్రారంభం

కిర్లంపూడి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరాడలో సేనాపతి హరికృష్ణ జ్ఞాపకార్థం వారి కుమారుడు సేనాపతి చెల్లారావు, సునీత దంపతులు రూ.10లక్షల ఆర్థిక సహాయంతో సురక్షిత మంచినీటి ఉచిత సరఫరా కేంద్రాన్ని నిర్మించారు. ఈ కేంద్రాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ గురువారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ అనుకుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను నూతన మెట్లను టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

ఏలేశ్వరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ రమణ సస్పెన్షన్ ఎత్తివేయాలని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మికులు గురువారం ఆందోళన చేపట్టారు. జేఏసీ నేతృత్వంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు డిపోగేటువద్ద ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. యూనియన్ డిపో కార్యదర్శి యుబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్‌పీ రావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా నాయకుడు చిలుకూరి రామ్‌కుమార్

బీజేపీ విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

చిలుకూరి రామ్‌కుమార్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ విధానాలను ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కోరారు. మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు మామిడితోటలో విశ్రాంతి మందిరంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కర్రి ధర్మరాజు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అనధికార క్వారీలపై అధికారుల దాడులు

రౌతులపూడి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మూలగపూడి సర్వేనెంబర్1లో అనధికార క్వారీలపై మైనింగ్ అధికారులు దాడులు చేశారు. మైనింగ్ ఆర్ఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో రెండురోజులపాటు ఉప్పపాలెం, మూలగపూడిలో దాడులు చేశారు. మూలగపూడి సర్వేనెంబర్1లో అనధికార క్వారీలో పనిచేస్తున్న డ్రిల్లింగ్ మిషన్, ఎక్స్‌కవేటర్, 210 మిషన్ కంపర్సన్‌ను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఉప్పపాలెంలో క్వారీలను పరిశీలించారు. రెండురోజులు మైనింగ్ అధికారులు దాడులతో అక్రమ క్వారీల్లో పనులు నిలిచిపోయి ఎక్కడి వాహనాలకు అక్కడే నిలిపివేశారు.

జాబ్‌మేళాలో 26 మంది ఎంపిక

రంపచోడవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో 26 మంది ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి డాక్టర్ పి.రోహిణి తెలిపారు. జాబ్‌మేళాలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు 64 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 24 మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.వసుధ పాల్గొన్నారు.

వై.రామవరం: గురువారం వై.రామవరం ఉపాధి హామీ కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాకు 28మంది యువతీ, యువకులు హాజరయ్యారని వీరిలో 18 మంది వివిధ విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఉపాధి ఏపీవో సాయిబాబా తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు మూడు నెలలపాటు సామర్లకోట, రాజమహేంద్రవరం, అడ్డతీగల వైటీసీ కేంద్రాల్లో శిక్షణాకాలాన్ని బట్టి రోజుకు రూ.300 చొప్పున ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో సామర్లకోట నుంచి ట్రైనర్ రత్నకుమార్, జాబ్ కోఆర్డినేటర్లు ప్రసాద్, నూకరాజు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఆర్థికసాయం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఒమ్మంగిలో అగ్నిప్రమాద బాధితులకు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ మురళీకృష్ణంరాజు గురువారం బియ్యం, నగదు అందజేశారు.

అడ్డగోలుగా కొల్లగొట్టేస్తున్న

పోలవరం గట్టు మట్టి


మట్టి తరలించడంతో బలహీనంగా మారిన పోలవరం గట్టు

గండేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాత్రయి తేచాలు.. పోలవరం గట్లను విచ్చలవిడిగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పగలంతా సైలెంట్‌గా ఉండి రాత్రిళ్లు తవ్వకాలు చేపడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నట్లు సమాచారం. గండేపల్లి గ్రామ శివారున కొంతకాలంగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం వరకు తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలా తవ్వేస్తే పోలవరం గట్లు బలహీనమైన మున్ముందు మరిన్ని సమస్యలు వచ్చే అవకాశాలున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడి వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

గండేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గురువారం డ్రగ్స్ వద్దు బ్రో, సైబర్ నేరాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీకి ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ప్రో ఛాన్సలర్ డాక్టర్ సతీష్‌రెడ్డి అధ్యక్షతన సదస్సులో ఎస్పీ మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ వాడినా, రవాణా చేసినా చాలా నష్టపోతారన్నారు. డ్రగ్స్ సేవిస్తూ, రవాణా చేస్తూ దొరికితే కఠిన శిక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. శక్తి యాప్‌పై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎస్పీకి ఆదిత్య యాజమాన్యం ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వీసీ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిజు, ఎస్‌టీబీఏఎస్ పి.శ్రీరామ్‌కోటేశ్వరరావు, ట్రైనింగ్ డీఎస్పీ సీహెచ్ జీవన, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యువీ శివనాగబాబు పాల్గొన్నారు.

నాడు గోతులదారి..నేడు రాజమార్గం

ఎమ్మెల్యే సత్యప్రభ కృషితో రోడ్డు నిర్మాణం

శంఖవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): శంఖవరం నుంచి పెదమల్లాపురం, వేళంగితోపాటు మరో పది అనుబంధ గ్రామాలకు వెళ్లాలంటే గోతులమార్గం ద్వారా వెళ్లాల్సి వచ్చేది. 20కిలోమీటర్ల దూరం గంటల సమయం పట్టేది. ఈ గోతుల దారిలో బస్సు నడపలేక ఆర్టీసీ సర్వీసులను నిలిపివేసింది. రాష్ట్ర ప్రభుత్వం వచ్చాక తీరుమారింది. వారి ఇబ్బందులు తొలగిపోయాయి. గిరిజన గ్రామాలకు రాజమార్గం ఏర్పడింది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషితో కొత్తపల్లి-పెదమల్లాపురం రహదారి రూ.6కోట్లతో రోడ్డును పూర్తిచేశారు. శంఖవరం-కొత్తపల్లి రహదారి రూ.3కోట్లతో పనులు ప్రారంభించారు. గౌరంపేట-రౌతులపూడి మండలం బంగారయ్యపేట రోడ్డును పూర్తిచేసి గిరిజనుల ఇబ్బందులను దూరం చేశారు.


ఇటీవల నిర్మించిన రహదారి

'అధికారులకు తెలిసే తవ్వకాలు'

రౌతులపూడి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండలంలోని అధికారులకు తెలిసే అనధికార క్వారీల్లో తవ్వకాలు జరుగుతున్నాయని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ మాలమహానాడు రత్నాకర్ అన్నారు. రౌతులపూడిలో అనధికార క్వారీలపై విలేఖరులతో మాట్లాడారు. అక్రమ మైనింగ్ అధికారులకు తెలిసే జరుగుతోందని విమర్శించారు. మైనింగ్ పేరుతో ప్రకృతిని ధ్వంసం చేయడం తగదన్నారు.

జనసేన నేతల పరామర్శ

రౌతులపూడి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎస్.పైడిపాలలో వైసీపీ నేతల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలను జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యుడు కరణం సుబ్రహ్మణ్యం పరామర్శించారు. దాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి బియ్యం, నగదు అందించారు. జనసేన శంఖవరం మండల అధ్యక్షుడు గాబు సుభాష్, ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జీ, ఎన్.నాగు, పి.సతీష్, షేక్ సలీం, టీడీపీ నాయకులు ఈగల సత్తిబాబు, శివ పాల్గొన్నారు.


గాయపడివారిని పరామర్శిస్తున్న కరణం సుబ్రహ్మణ్యం తదితరులు

తడిపొడి చెత్తపై అవగాహన కల్పించండి

శంఖవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తడిపొడి చెత్తను విడదీయడంపై మహిళలకు అవగాహన కల్పించాలని డీఎల్‌పీవో ఎం.బాలామణి పేర్కొన్నారు. బుధవారం కత్తిపూడి, శంఖవరం గ్రామాలలో ఆమె పర్యటించిన అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి వి.చక్రవర్తి, కె.అప్పలరాజు, ఎం.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

తొండంగి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ అన్నారు. గురువారం కొమ్మనాపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న మంచినీటి పథకానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోన నాగేశ్వరరావు, కోన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తునిలో అగ్ని ప్రమాదం


వివరాలు సేకరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తుని రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తుని పట్నం రామకృష్ణ కాలనీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇంట్లోని విలువైన సామగ్రితో పాటు కొంత నగదు దగ్ధమైనట్టు బాధితులన్నారు. ఇంటి యజమాని బి.ప్రసన్నకుమార్ సమాచారంతో ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పారు. టీడీపీ నాయకులు సిద్దాంతపు సత్తిబాబు బాధితులను పరామర్శించారు. ఎమ్మెల్యే దివ్య అన్ని విధాలా ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

అడవిలో కార్చిచ్చు

● దగ్ధమవుతున్న అడవులు
● భయపడుతున్న ప్రజలు


అడవిలో కార్చిచ్చుతో దగ్ధమవుతున్న చెట్లు

మోతుగూడెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిసర ప్రాంతాలలో గత కొన్నిరోజులుగా భానుడి ప్రతాపంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈప్రాంతంలో గట్టులకు నిప్పు రగులుకొని అడవులు దగ్ధమవుతున్నాయి. ఎండ వేడిమికి అడవులు దగ్ధం కావడంతో ప్రజలు, వృద్ధులు, చిన్న పిల్లలు అల్లాడిపోతున్నారు. పలు ప్రాంతాలు అడవిలో కొన్నిరోజులుగా దగ్ధమవుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు అవకాశం లేకపోవడంతో వృక్ష సంపద జంతు సంపదకు నష్టం ఏర్పడుతోంది. ఈ సమయంలో అడవికి నిప్పు అంటుకోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు సతమతమవుతున్నారు. అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మోతుగూడెం పరిధిలోని గ్రామస్థులు కోరుతున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రాజవొమ్మంగి ఏప్రిల్ 3: రాజవొమ్మంగి మండలం సూరంపాలెం గ్రామ శివారులో గురువారం పోలీసులు పేకాట శిబిరంపై దాడిచేసి ఏడుగురిని అరెస్టుచేశారు. సూరంపాలెం గ్రామశివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు డీఎస్పీ సాయిప్రశాంత్ ఆదేశాల మేరకు జడ్డంగి ఎస్ఐ చిన్నబాబు సిబ్బందితో దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. అరెస్టుచేసిన వారి నుంచి రూ.18,680 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిత్యం అదే ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నారు.

అభివృద్ధి పనులపై నిలదీత

బడ్జెట్‌ను ఆమోదించిన సభ్యులు

తుని రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బడ్జెట్ రూపకల్పన ఎంపీపీ బొప్పన రాము అధ్యక్షతన జరిగింది. దీనికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతోపాటు మండల పరిషత్ సిబ్బంది హాజరయ్యారు. మండల పరిషత్ బడ్జెట్ రూ.72,78,09,079 లక్షల బడ్జెట్‌ను సభ్యులు ఆమోదం తెలిపారు. మండలంలో పలు సమస్యలతో పాటు ప్రజా ప్రతినిధుల ప్రొటోకాల్‌పై చర్చ జరిగింది. గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండానే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండిపడ్డారు. జడ్పీటీసీ పి.సూర్యామణి చాంబర్ తొలగింపుపై ప్రశ్నించడంపై సమావేశం రసాభాసగా మారింది. సమస్యల పరిష్కారానికి ఎంపీడీవో సాయిన వీస్ చొరవ చూపుతానని హామీ ఇవ్వడంతో బడ్జెట్ సమావేశం ముగిసింది.

సత్యదేవుడి కల్యాణోత్సవాల నిర్వహణపై సమీక్ష

అన్నవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో ప్రారంభమయ్యే సత్యదేవుడి వార్షిక దివ్యకల్యాణోత్సవాలకు సంబంధించి సిబ్బందితో ఈవో వీర్ల సుబ్బారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. వైదిక కార్యక్రమాల నిర్వహణలో జాగ్రత్తగా శాస్త్రోక్తంగా చేపట్టాలని సూచించారు. సిబ్బంది గతేడాది మినిట్స్ ఈవో ముందుంచారు. గతేడాది గ్రామంలో రథోత్సవ సమయంలో ఏర్పడిన విద్యుత్ సమస్య, ఇతర ఇబ్బందులను ఈవోకు వివరించారు. విద్యుత్ సరఫరాలో గ్రామంలో ఒకరోజంతా అంతరాయం, తదితర సమస్యలను తీసుకెళ్లారు. సమన్వయంతో ఇబ్బందులు లేకుండా ముందుకెళ్లాలని త్వరలో రెవెన్యూ, పోలీస్ ఉన్నతాదికారులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలేశ్వరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో శుక్రవారం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు గురువారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నర్సీపట్నం రోడ్డు, దిబ్బలపాలెం, లక్ష్మవరంకాలనీ, షిర్డీనగర్, రాజమండ్రి కాలనీలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. యర్రవరం పరిధిలో కొన్ని వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జగ్గంపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11కేవీ నరేంద్రపట్నం, 11కేవీ ఇర్రిపాక ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఇర్రిపాక, నరేంద్రపట్నం, మామిడాడ గ్రామాలకు, బోరులకు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆశాఖ ఏఈ వీరభద్రరావు తెలిపారు. 11కేవీ సెంటర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 12గంటల వరకు కాట్రావులపల్లి, ఎర్రంపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

ఏలేశ్వరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా లూథరన్ టౌన్ ప్యారిస్ పాస్టర్ ప్రశాంత్ కుమార్ నేతృత్వంలో ఏలేశ్వరం మండల పాస్టర్లు, క్రైస్తవులు సమైక్యంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.